తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 105 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 సోమవారం 16 - 11 - 2026 వెల రూ. 2 రూ/

ప్రధాని మోదీతో భేటీ అయిన

రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

- రాష్ట్రంలో కరవు నివారణ చర్యల కోసం రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞప్తి
- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నమోదైన 17 శాతం లోటు వర్షపాతంపై ప్రధానికి వివరణ
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా క్రీడలకు ప్రధానికి ఆహ్వానం
- తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం
- రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రధానితో చర్చ
- ఎల్‌నినోతో ఏర్పడిన కరవు పరిస్థితులు, ఆర్థిక సాయం గురించి వివరించిన సీఎం
- సమ్మక్క--సారక్క బ్యారేజీ క్లియరెన్స్ ప్రక్రియ వేగవంతం చేయాలని అభ్యర్థన



హైదరాబాద్ :

ఢిల్లీలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసేపటి క్రితం సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితులను అధిగమించడానికి, రైతులను ఆదుకోవడానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్యాకేజీ రూపంలో అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ భేటీలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ కూడా ఈ సమావేశంలో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రంగా పడిపోయిన తీరును ముఖ్యమంత్రి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సుమారు 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు వివరించారు.రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 31 జిల్లాల్లోని 365 మండలాలను ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రధానికి తెలియజేశారు. ఇందులో 111 మండలాలు తీవ్ర కరవు బారిన పడగా, 254 మండలాలు మధ్యస్థాయి కరవును ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వర్షాభావం కారణంగా ఖరీఫ్ సీజన్ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గిపోయిందని వివరించారు. - మిగతా 2 లో



హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

- బొరంపేట వద్ద ఐదు బస్సుల దగ్ధం
- పార్కింగ్ యార్డులో నిలిపి ఉంచిన ఐదు బస్సులు దగ్ధం
- అర్ధరాత్రి వేగంగా వ్యాపించిన మంటలు
- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని అనుమానం
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్ :

హైదరాబాద్ శివారు బొరంపేటలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ప్రైవేట్ - మిగతా 2 లో

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- కాంగ్రెస్ బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రాహుల్ బైక్ వెనుక మంత్రులు పరిగెత్తడంపై ఆగ్రహం
- తెలంగాణ పునాది ఆత్మగౌరవమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్ ప్రశ్నలు
- ఫిట్‌గా ఉన్నందునే పరిగెత్తానన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

మావోయిస్టుల హింసాకాండతో

ఆదివాసీలు నష్టపోయారు



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం- మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు
- జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ :

మావోయిస్టుల హింసాకాండ వల్ల ఆదివాసీలు నష్టపోయారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిని గాలికొదిలేశాయని ఆరోపించారు. నక్సలైట్లు గిరిజనుల ఓటు హక్కును సైతం కాలరాసినా నాటి పాలకులు చోద్యం చూస్తూ ఉండిపోయారని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్ర గడ్చిరోలిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. 3వేల కోట్ల రూపాయల విలువైన 246 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. దశాబ్దాలుగా కనీస వసతులకు నోచుకోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మోదీ తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రగతి కోసం లక్ష కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గిరిజన వర్గాలు ఎల్లప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డాయని ప్రశంసించారు. దేశంలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని అన్నారు.“మావోల హింస వల్ల గిరిజన సమాజం ఎక్కువగా నష్టం పోయింది. 2014లో దేశంలోని దాదాపు 125 - మిగతా 2 లో



స్టార్‌షిప్‌ను ఒడిసిపట్టిన స్పేస్‌ఎక్స్

- ఏళ్ల నాటి కల సాకారం!
- అంతరిక్ష యాత్ర ముగించుకుని భూమికి చేరిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్
- టెక్సాస్‌లోని లాంచ్ టవర్ మెకానికల్ చేతులతో విజయవంతంగా క్యాచ్
- పునర్వినియోగ రాకెట్ల తయారీలో స్పేస్‌ఎక్స్ చారిత్రక మైలురాయి
- రాకెట్ రెండు భాగాలను తిరిగి పొందే ప్రణాళికలో కీలక ముందడుగు

ఢిల్లీ :

ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల్లో స్పేస్‌ఎక్స్ సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఏళ్ల తరబడి శ్రమిస్తున్న ఒక అసాధారణ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. అంతరిక్ష కక్ష్యలోకి వెళ్లి, భూమికి తిరిగి వచ్చిన తన స్టార్‌షిప్ వ్యోమనౌకను (అప్పర్ స్టేజ్) ఈరోజు టెక్సాస్‌లోని లాంచ్ టవర్ వద్ద ఉన్న భారీ యాంత్రిక చేతులతో సురక్షితంగా పట్టుకుంది. పూర్తిస్థాయిలో, వేగంగా - మిగతా 2 లో



1950 తర్వాత అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

- 2027 వరకు ప్రపంచానికి తప్పని ముప్పు!
- 2027 మార్చి వరకు దీని ప్రభావం కొనసాగే అవకాశం
- పసిఫిక్ మహాసముద్రంలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న ఉపరితల ఉష్ణోగ్రతలు
- ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు!
- అమెరికాకు చెందిన ఎన్‌వోవీపీ, డబ్ల్యూఎంవో సంస్థల నివేదిక

డిసెంబర్ మొదటి వారంలో

శీతాకాల సమావేశాలు



- మళ్లీ తెరముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు!
- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది

ఢిల్లీ :

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ వాతావరణం అంతకంతకూ ఘర్షణపూరితంగా మారుతున్న నేపథ్యంలో, డీలిమిటేషన్‌కు సంబంధించిన ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభుత్వానికి అతిపెద్ద శాసనపరమైన ప్రాధాన్యంగా మారింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ బలాన్ని ప్రస్తుతమున్న 543 సీట్ల నుంచి గరిష్ఠంగా 850కి విస్తరించాలని కోరుతున్న ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇది 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు మార్గం సుగమం చేయనుంది.



సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లోకి

కొత్త వాహనాలు

- ఆరు ఫోర్స్ అర్బానియా వాహనాల కొనుగోలుకు ఆమోదం
- వాహనాల కోసం రూ. 1.78 కోట్లు మంజూరు చేసిన ఏపీ ప్రభుత్వం
- జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు ప్రక్రియ
- భద్రతా సిబ్బంది ప్రయాణ సౌలభ్యం కోసం ఆధునిక ఏర్పాట్లు

అమరావతి :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం సెక్యూరిటీ కాన్వాయ్ అవసరాల దృష్ట్యా - మిగతా 2 లో

రాష్ట్రానికి మరో

తుపాను ముప్పు



- ప్రస్తుతం ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైంది
- ఉత్తర కోస్తా వైపు తుపాను కదలికలు
- బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం
- ఏపీ, దక్షిణ ఒడిశాకు వాతావరణ శాఖ హెచ్చరిక
- తీర ప్రాంతాలపై తుపాను ప్రభావం ఉండే అవకాశం

అమరావతి :

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు ముంచుకొస్తోంది. ఏపీ, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ తుపాను ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. ప్రస్తుతం - మిగతా 2 లో

పంచాయతీ ఎన్నికల సందడి

తొలి విడత నామినేషన్లు షురూ

- ఏపీలో మొదలైన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ
- తొలి దశలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఎన్నికలు
- 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- నవంబరు 26న పోలింగ్, అదే రోజు ఫలితాలు
- భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేసిన పోలీసులు



అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, తొలి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభం. మొదటి దశలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని పలు మండలాల్లో ఎన్నికలు జరగనుండగా, ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి.తొలి విడతలో భాగంగా అనంతపురం జిల్లాలోని కల్యాణదుర్గం, అనంతపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లోనూ, కర్నూలు జిల్లాలోని ఆదోని, పత్తికొండ డివిజన్ల పరిధిలోని 8 మండలాల్లోనూ ఎన్నికలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నవంబర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 18న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను కూడా - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
సోమవారం 16 - 11 - 2026

సంపాదకీయం

అమెరికా ఎన్నికల పాఠం!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు కాంగ్రెస్‌ను తిరిగి కైవసం చేసుకున్నారు. అక్కడ గెలిచిన అభ్యర్థులు మాట్లాడిన విషయాలు మన రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా ప్రతిపక్షాలకు, ఎంతో నేర్పుతాయి. అమెరికాలో ఓటర్లు ఈ ఎన్నికల్లో ఆర్థిక పరిస్థితుల పట్ల ఆందోళనతో పోలింగ్ బూత్‌లకు వెళ్లారు. ఎన్‌బీసీ ఎగ్జిట్‌పోల్ ప్రకారం, 88శాతం మంది నిత్యావసర సరుకుల ధరల గురించి; 86శాతం మంది కరెంటు, నీటి బిల్లుల గురించి; 85శాతం మంది వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందారు. గెలిచిన అభ్యర్థులూ వీటి గురించే మాట్లాడారు. నార్త్ కరోలినాలో రాయ్ కూపర్ 'ధరలు తగ్గిద్దాం' అనే నినాదంతో ప్రచారం మొదలుపెట్టారు. సౌత్ కరోలినాలో అనీ ఆండ్రూస్ అందరికీ అందుబాటులో వైద్యం, తక్కువ ఖర్చు అనే అంశాలపై పోటీ చేశారు. ఇంకా చాలామంది అభ్యర్థులు ఇలాంటి సమస్యలపైనే మాట్లాడారు. అలా అని వాళ్లు అమెరికాలో పెరుగుతున్న జాతి విద్వేషాల గురించీ, హింస గురించీ మాట్లాడలేదని కాదు. అమెరికన్ ఓటర్ల ఆందోళనలో ఆర్థిక వ్యవస్థ తర్వాత రెండో స్థానంలో ప్రజాస్వామ్యమే ఉంది. గెలిచినవాళ్లు చేసింది ఏమిటంటే, ఈ రెండింటినీ కలిపి చెప్పడం. వాళ్లందరి సందేశం సరళమైనది. అధికారం కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిందంటే దాని ఫలితంగా మీ ఇంటి అద్దె పెరుగుతుంది, ఆసుపత్రి బిల్లులు పెరుగుతాయి. ఈ సందేశం ఎలా పనిచేసిందంటే-- విలువల గురించి మాట్లాడితే అప్పటికే ఆ విలువల గురించి ఆందోళన చెందే కొందరి సమ్మతి మాత్రమే లభిస్తుంది. అదే ఆ విలువలను వంటింటి సమస్యలతోనో పెరుగుతున్న ధరలతోనో ఆరోగ్య వసతితోనో కలిపి చెప్తే అప్పుడు అందరూ కదులుతారు.మన దేశంలో ఈ సమస్యలు మరింత దారుణంగా ఉన్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం 6.09శాతానికి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం 8.94శాతానికి ఎగబాకింది. నగరాల్లో ద్రవ్యోల్బణం 5.41శాతం ఉంటే, గ్రామాల్లో అది 6.63శాతం. ఒక రోజువారీ కూలీకి కూరగాయలు, పప్పుల మీద పెరిగే ప్రతి రూపాయి, పిల్లల పుస్తకాల నుంచో, ఆసుపత్రికి వెళ్లే ఖర్చు నుంచో కోత పడుతున్నది. నగరాల్లో యువత నిరుద్యోగం 19శాతానికి చేరింది. జాతీయ ఆరోగ్య సంస్థ తాజా అంచనాల ప్రకారం, ప్రస్తుత ఆరోగ్య వ్యయంలో దాదాపు సగాన్ని ప్రజలు తమ జేబు నుంచే భరిస్తున్నారు. ఈ సమస్యలకు నగరాల్లో అద్దెలు, పాఠశాల ఫీజులు, ప్రభుత్వ శిశు సంరక్షణ సౌకర్యాల కొరత కలిపితే... సామాన్య భారతీయుడి జీవితాన్ని ప్రభావితం చేసే అసలు ఎజెండా ఏమిటో అర్థమవుతుంది.2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు సీఎస్‌డీఎస్--లోక్‌నీతి సర్వేలో 27శాతం మంది నిరుద్యోగాన్ని తమ ప్రధాన సమస్య అని చెప్పారు. 23శాతం మంది ధరల పెరుగుదల అని చెప్పారు. ఇందుకు భిన్నంగా రామమందిరం తమ ఓటును నిర్ణయించే ప్రధాన అంశమని చెప్పింది 8శాతం మంది మాత్రమే. భారతదేశ సామాజిక, సాంస్కృతిక, మత స్వరూపంలో వస్తున్న మార్పులు ముఖ్యం కాదని అనలేం. కానీ మీ జీవితాన్ని, మీ ఓటును ఏది నిర్ణయిస్తుందని ప్రజలను అడిగినప్పుడల్లా వాళ్ల సమాధానం మళ్లీ మళ్లీ ఉద్యోగాలు, ధరల దగ్గరకే వస్తోంది.ఈ ఏడాది పేపర్ లీక్ కారణంగా దేశ యువత రోడ్ల మీదకు వచ్చింది. వారి నిరసనలు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చేంత పెద్దవయ్యాయి. సెప్టెంబర్, అక్టోబర్ నాటికి ఈ నిరసనలు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ దాకా విస్తరించాయి. పరీక్షల విశ్వసనీయత, న్యాయమైన ఎన్నికలు అత్యంత ముఖ్యమైనవే. కానీ యువత ఆగ్రహం లోతుల్లోకి చూస్తే నిరుద్యోగం, ఆర్థికంగా ఎదిగే అవకాశాలు లేకపోవడమే ఈ నిరసనలకు దారితీసిందని అర్థమవుతుంది.నగర విద్యార్థుల ఉద్యమం ఎంత ప్రభావవంతంగా ఉన్నప్పటికీ అది ఒక్కటే రాజకీయ ఎజెండాను మార్చలేదు. గ్రామీణ భారతం కూడా అందులో కలవాలి. గ్రామాలు ఇప్పటికీ అవే సమస్యలతో సతమతమవుతున్నాయి. గ్రామీణ యువత నిరుద్యోగం నానాటికీ పెరుగుతూనే ఉంది. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న యువకుడు, కోచింగ్ ఫీజు కట్టలేని యువతి, నీట్ పేపర్ వాట్సాప్‌లో లీకవడం చూసిన రైతు కొడుకు... వీళ్లందరిలోనూ ధిల్లీ విద్యార్థిలోని ఆగ్రహమే ఉంది. కానీ వ్యక్తం చేయడానికి వాళ్లకు వేదికలు తక్కువ. నగర --గ్రామీణ ప్రపంచాల మధ్య బంధం బలపడినప్పుడు, గ్రామీణ పేదలు, నగర యువత ఒకేలాంటి విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టినప్పుడు, అప్పుడవి 'యువత సమస్యలు'గానో, 'రైతుల సమస్యలు'గానో మిగలవు. రాజకీయ పోటీకి కేంద్ర బిందువులు అవుతాయి. రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాల చుట్టూ ప్రజలను సంఘటితం చేయాలి. పప్పు ధర, నగరంలో గది అద్దె, ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవ ఖర్చు, డిగ్రీ తర్వాత ఎప్పటికీ రాని ఉద్యోగం ఇలాంటి రోజువారీ సమస్యలను న్యాయం, అధికారం అనే పెద్ద ప్రశ్నలతో ముడిపెట్టాలి. పేదల తరఫున మాట్లాడాలనుకునే ఏ పార్టీ అయినా అమెరికా మధ్యంతర ఎన్నికల నుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఇదే.



మావోయిస్టుల హింసాకాండతో ఆదివాసీలు నష్టపోయారు

మొదటిపేజీ తరువాయి -

జిల్లాలు మావోయిజం, నక్సలిజంతో ఇబ్బందిపడ్డాయి. ఏటా వందలాది హింసాత్మక ఘటనలు జరిగేవి. ఈ ఘటనల్లో వేలాది మంది అమాయకులు తమ ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. మృతుల్లో ఆదివాసీ సోదర సోదరీమణులే అత్యధిక సంఖ్యలో ఉండేవారు. గత ప్రభుత్వాలు మావోయిజం, నక్సలిజం బారిన పడిన గిరిజనులను గాలికి వదిలేశాయి. గిరిజనుల హక్కులను లాక్కున్నా నోటికి తాళం వేసుకుని కూర్చున్నారు. గిరిజన సమాజ సోదర సోదరీమణులను కనీసం ఓటు కూడా వేయనిచ్చేవారు కాదు. అప్పటి ప్రభుత్వాలు కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తూ కళ్లు మూసుకున్నాయి. నేడు నక్సలిజం-మావోయిజం పూర్తిగా అంతం కావడంతో గిరిజన సమాజానికి చెందిన తల్లులు, సోదరీమణులు మాకు తమ ఆశీస్సులను అందిస్తున్నారు. దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం-మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటి. కొద్ది రోజుల క్రితమే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ కేంద్రంలో నేను భద్రతా దళాలతో కలిసి దీపావళి జరుపుకొన్నాను. ఒకప్పుడు ప్రజలు వెళ్లడానికి కూడా భయపడిన ప్రాంతం అది. గడ్చిరోలితో సహా నక్సల్ ప్రభావిత ప్రాంతాలన్నింటిలోనూ ఇప్పుడు కేవలం దీపావళి దీపాలే కాకుండా, ప్రజల జీవితాల్లో ఒక కొత్త ఆశాకిరణం కూడా ప్రసరించింది.'జనజాతీయ గౌరవ్ దివస్' అనేది గిరిజన సమాజం గౌరవానికి, గిరిజన నాయకుడు బిర్సా ముండా అందించిన స్ఫూర్తికి సంబంధించిన పండుగ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. "2021 నవంబర్ 15 నుంచి 'జనజాతీయ గౌరవ్ దివస్' (గిరిజన గౌరవ దినోత్సవం) జరుపుకొంటున్నాం. నేడు ఇది ఒక జాతీయ వేడుకగా మారింది. గతేడాది భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా కార్యక్రమాలు జరిగాయి. వీటిలో కోట్ల మంది పౌరులు పాల్గొన్నారు. ఒకప్పుడు అనేక పండుగలు, సందర్భాలు విదేశీ దృక్కోణం నుంచి నిర్ణయించేవారు. కానీ నేడు, భారతదేశం తన వారసత్వాన్ని, చరిత్రను, వీరులను స్వదేశీ గర్వంతో స్మరించుకుంటోంది. ఇది మన జాతీయ చైతన్యంలో వచ్చిన ఒక పెద్ద మార్పునకు సంకేతం." అని ప్రధాని మోదీ అన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 15న జనజాతీయ గౌరవ్ దివస్‌ను పాటిస్తారు. 1875లో గిరిజన సమాజంలో జన్మించిన బిర్సా ముండా, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన గిరిజన ప్రతిఘటనలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు.

1950 తర్వాత అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

మొదటిపేజీ తరువాయి - ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ఎల్‌నినో మరింత బలపడుతోంది. 1950 తర్వాత ఇదే అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినోగా మారనుందని, దీని ప్రభావం 2027 మార్చి వరకు కొనసాగవచ్చని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌వోఏఏ) తాజాగా హెచ్చరించింది. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సరళిలో భారీ మార్పులకు కారణం కానుందని ఆందోళన వ్యక్తం చేసింది.ఎల్‌నినో కారణంగా భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో వేగంగా పెరుగుతున్నాయి. ఈ పెరుగుదల గతంలోని అన్ని రికార్డులను బద్దలు కొట్టనుందని ఎన్‌వోఏఏ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతంలో తీవ్ర వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించనుండగా, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, అడవుల్లో కార్చిచ్చులు అధికమవడం వంటి పరిణామాలు కూడా సంభవిస్తాయి.ఎన్‌వోఏఏ, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) నివేదికల ప్రకారం, ఎల్‌నినో తీవ్రత క్రమంగా పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా 2027 జనవరి నుంచి మార్చి మధ్య కాలంలో ఇది అత్యంత బలమైన స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రధాని మోదీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి - కరవు సహాయక చర్యలతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపులపై కూడా చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'తో పాటు 'ఖేలో ఇండియా' క్రీడల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధాని మోదీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.



స్టార్‌షిప్‌ను ఒడిసిపట్టిన స్పేస్‌ఎక్స్

మొదటిపేజీ తరువాయి - పునర్వినియోగించగల రాకెట్లను తయారు చేయాలనే స్పేస్‌ఎక్స్ లక్ష్య సాధనలో ఇది ఒక చారిత్రక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.ఇవాళ భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2:52 గంటలకు 'షిప్ 42' అనే ఈ స్టార్‌షిప్‌ను లాంచ్ టవర్‌కు అమర్చిన 'చాప్‌స్టిక్స్' అనే భారీ మెకానికల్ చేతులు గాల్లోనే పట్టుకున్నాయి. ఈ అద్భుత ఘట్టానికి ముందు, స్టార్‌షిప్ దాదాపు 22 గంటలకు పైగా అంతరిక్షంలో గడిపింది. నవంబర్ 14న సౌత్ టెక్సాస్‌లోని స్టార్‌బేస్ నుంచి నింగిలోకి ఎగిసిన ఈ రాకెట్, భూమికి 275 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న నిమ్న భూకక్ష్యకు చేరుకుంది.తన 15వ ఇంటిగ్రేటెడ్ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా, ఈ స్టార్‌షిప్ కక్ష్యలో ఉన్న సమయంలో భూమి చుట్టూ దాదాపు 14 సార్లు ప్రదక్షిణలు చేసింది. ఈ యాత్రలో అత్యంత కీలకమైన 26 నెక్ట్ జనరేషన్ స్టార్‌లింక్ ఎ3 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. అంతేకాకుండా వ్యోమనౌకతో పాటు పంపిన మూడు ఉపగ్రహాలు స్టార్‌షిప్ హీట్ షీల్డ్ (వేడి కవచం), ఇతర భాగాలను నిశితంగా పరిశీలించాయి. భూమికి తిరిగి వచ్చే ప్రయాణానికి నౌక ఎంత సిద్ధంగా ఉందో అంచనా వేయడానికి ఈ కెమెరాల ద్వారా అందిన సమాచారం ఇంజనీర్లకు ఎంతగానో సహాయపడింది.అన్ని తనిఖీలు పూర్తయిన తర్వాత, స్టార్‌షిప్ తన ఇంజిన్లను మండించి (డీ-ఆర్బిట్ బర్న్) భూ వాతావరణంలోకి ప్రవేశించడం ప్రారంభించింది. కిందకు దిగే క్రమంలో తన వేగాన్ని నియంత్రించుకుంటూ, స్టార్‌బేస్‌లోని లాంచ్ టవర్‌కు కచ్చితంగా వచ్చేలా తనను తాను మలచుకుంది. ఆ తర్వాత టవర్‌కు ఉన్న రెండు భారీ యాంత్రిక చేతులు వ్యోమనౌకను సున్నితంగా పట్టుకుని, లాంచ్ ప్యాడ్ పైన గాలిలో నిలిపివేశాయి.గతంలో స్పేస్‌ఎక్స్ తన సూపర్ హెవీ బూస్టర్లను విజయవంతంగా రికవరీ చేసి, తిరిగి ఉపయోగించినప్పటికీ, కక్ష్య నుంచి తిరిగి వచ్చిన స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను ఇలా టవర్‌తో పట్టుకోవడం ఇదే తొలిసారి. రాకెట్‌లోని రెండు భాగాలను (బూస్టర్, అప్పర్ స్టేజ్) తిరిగి భూమికి తెచ్చి, తనిఖీ చేసి, మళ్లీ ప్రయోగాలకు వాడాలన్నది స్పేస్‌ఎక్స్ ప్రణాళిక. తాజా విజయంతో ఆ ప్రణాళికలో ఒక ముఖ్యమైన భాగాన్ని నిరూపించినట్లయింది.ఈ 15వ ప్రయోగంలో వాస్తవానికి రాకెట్‌కు చెందిన రెండు భాగాలను టవర్‌తో పట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, సూపర్ హెవీ బూస్టర్‌ను పట్టుకునే ప్రణాళిక చివరి నిమిషంలో రద్దు కావడంతో, అది గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో సురక్షితంగా ల్యాండ్ అయింది.ఈ చిన్న లోపం మినహా, స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను పట్టుకోవడం ద్వారా ఈ మిషన్ ఒక ప్రధాన లక్ష్యాన్ని సాధించింది. రాకెట్లను పునర్వినియోగించడం ద్వారా ప్రయోగాల ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు. ఇది భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడిపైకి మానవసహిత యాత్రలు చేపట్టాలన్న స్పేస్‌ఎక్స్ ఆశయాలకు మరింత ఊతమిస్తుంది.

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి -

తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు.తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు.కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

పంచాయతీ ఎన్నికల సందడి తొలి విడత నామినేషన్లు షురూ

మొదటిపేజీ తరువాయి - పూర్తి చేస్తారు.ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ర్యాలీలు, ఊరేగింపులపై ఆంక్షలు విధించామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లోకి కొత్త వాహనాలు

మొదటిపేజీ తరువాయి - కొత్త వాహనాలను సమకూర్చడానికి అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోకి కొత్తగా 6 అత్యాధునిక 'ఫోర్స్ అర్బానియా' వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం ఈ 6 వాహనాల కొనుగోలుకు సుమారు రూ. 1.78 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రక్రియను పూర్తిగా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 'జెమ్' పోర్టల్ ద్వారా కొనుగోలు ప్రక్రియను త్వరలోనే పూర్తి చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.సీఎం కాన్వాయ్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించే భద్రతా సిబ్బంది ప్రయాణం మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆధునిక హంగులు, విశాలమైన స్థలం, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు అనువైన సాంకేతిక ఫీచర్లు ఈ వాహనాల్లో ఉన్నాయి. ఈ కొత్త వాహనాల చేరికతో భద్రతా సిబ్బంది రాకపోకలు మరింత వేగవంతం కావడంతో పాటు ముఖ్యమంత్రి కాన్వాయ్ పనితీరు, సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు

మొదటిపేజీ తరువాయి - ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. ఇది గంటకు సుమారు 10 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు గుర్తించారు. ఇది ప్రస్తుతానికి చెన్నైకి 840 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 1010 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్ కు 1130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఈ వాయుగుండం తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ వాయుగుండం తదుపరి ఉత్తర- వాయువ్య దిశగా కదిలి తర్వాత దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముంది. ఆ తర్వాతి రెండురోజుల్లో వాయవ్య దిశగా కదులుతూ రాష్ట్ర తీరప్రాంతం వైపు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం వాయుగుండం గమనాన్ని వెదర్ డాప్లర్ రాడార్ల ద్వారా నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం అంచనాల ప్రకారం దీని ప్రభావం రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం!

ఈగల్ డీఎస్పీ

హైదరాబాద్‌లో టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది

ఈ-సిగరెట్లు దొరక్కుండా చేస్తామని డీఎస్పీ మధు మోహన్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో యువత, టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. రాయదుర్గంలోని ఓ అవుట్‌లెట్‌పై దాడిచేసి భారీగా నిషేధిత వేప్స్, విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పన్నులు ఎగ్గొట్టి చైనా నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటూ ర్యాపిడో, ఉబర్, ఓలా వంటి యాప్‌ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా డెలివరీ చేస్తున్నట్లు గుర్తించామని ఈగల్ డీఎస్పీ మధు మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ అక్రమ దందాపై ఈటీవీ భారత్ ముఖాముఖిలో అనేక వివరాలు వెల్లడించారు.2019 లో కేంద్ర ప్రభుత్వం వేప్స్, ఈ-సిగరెట్లపై నిషేధం విధించింది. ఈజీ మనీ కోసం కొంతమంది వ్యక్తులు వీటిని చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో కేరళంకు చెందిన వ్యక్తులు కూల్‌డ్రింక్‌లు, పెర్‌ఫ్యూమ్ షాపుల మాటున వేప్స్, ఈ-సిగరెట్ల దందా పకడ్బందీగా నడుపుతున్నట్లుగా గుర్తించాం. ఆయా షాపులకు సంబంధించి ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్ చేసుకొని, ఆ గ్రూపులో కస్టమర్లను యాడ్ చేసుకుంటున్నారు. వేప్స్, ఈ-సిగరెట్ల కొత్త స్టాక్ వివరాలు ఆ గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. రోజుకో ఫ్లేవర్ ఉందంటూ ఆ గ్రూప్‌లో ఎక్కువగా ఉన్న టీనేజర్లను ఆకర్షిస్తున్నారు. కొన్ని షాపులోనే అమ్మకాలు చేస్తుండగా, మరికొన్ని వాట్సప్ ద్వారా ఆర్డర్ తీసుకుని కస్టమర్ లొకేషన్‌కు పోర్టర్ ద్వారా, ర్యాపిడో, ఉబర్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిసింది. పన్నులు చెల్లించకుండా అక్రమమార్గంలో దందా చేస్తున్నారు. మామూలు సిగరెట్ కంటే నాలుగు రెట్ల హానికరమైన నికోటిన్ కలిగి ఉండే ఈ-సిగరెట్ల వల్ల యువత ఆరోగ్యానికి తీవ్రనష్టం కలుగుతోంది.కేరళంలోని కాసరగోడ్‌కు చెందిన వారు ఎక్కువగా దుబాయిలో ఉంటారు. అక్కడ కొంతమంది ఈ నిషేధిత ఉత్పత్తులను దుబాయి నుంచి ముంబయికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. 2 నెలల్లో 11 కేసులు, 16 మందిని అరెస్ట్ చేశాం. 1600 కు పైగా ఈ-సిగరెట్లు సీజ్ చేశాం. ఆన్‌లైన్ పేమెంట్ కోసం వాడుతున్న అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నాం. వెనక ఉండి దందా నడిపిస్తున్న యాజమానులను కూడా పట్టుకుంటాం.అక్టోబర్‌లో మాదాపూర్ కేసులో కేరళంకు చెందిన అబూబాకర్ సిద్ధిఖీ అకౌంట్‌లో 2, 3 ఏళ్లల్లో దాదాపు రూ.2 కోట్ల క్రెడిట్స్ జరిగినట్లుగా గుర్తించాం. దీన్నిబట్టి మార్కెట్ చాలా విస్తరించి ఉన్నట్లుగా తెలుస్తోంది. ఎలాంటి టాక్స్ లేకుండా అక్రమ వ్యాపారం జరుగుతోంది. ఆ బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నాం. ఈ దందా చేసే వారిపై దృష్టి పెడుతున్నాం.కొన్ని సంస్థలు ఇలాంటి వ్యవహారాలని నాయకత్వం భావిస్తోంది. మరోవైపు, నెల్లూరు జిల్లా పరిధిలోని కావలి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా భరత్ కుమార్‌ను పార్టీ ఎంపిక చేసింది. అలాగే బాపట్ల మున్సిపాలిటీ అభ్యర్థిగా సునీల్ కుమార్ పేరును ప్రకటించారు.పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ఈ ఎన్నికల్లో ముందుకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. కీలక స్థానాలకు అభ్యర్థుల ప్రకటన వెలువడటంతో ఆయా ప్రాంతాల్లోని బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కార్యకర్తలు ఇప్పటికే క్షేత్రస్థాయి ప్రచార సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానాలకు కాకుండా, ప్రాధాన్యత ఉన్న ప్రధాన స్థానాల వివరాలను మాత్రమే పార్టీ

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
సోమవారం 16 - 11 - 2026

చేనేత రంగంలో మరో జాతీయ పురస్కారాన్ని అందుకున్న ధర్మవరం డిజైనర్ జూజారే నాగరాజు



ధర్మవరం / హైదరాబాద్ (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : చేనేత కళాఖండాలకు ప్రసిద్ధి చెందిన ధర్మవరం పట్టణానికి చెందిన ప్రముఖ చేనేత డిజైనర్ జూజారే నాగరాజుకు మరోసారి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు అఖిల భారతీయ స్వకుల సాలి సమాజ్ 14వ జాతీయ మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ మహాసభల ముగింపు వేడుకల్లో భాగంగా, చేనేత పరిశ్రమ అభివృద్ధికి మరియు వినూత్న డిజైన్ల రూపకల్పనకు నాగరాజు చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ఆయనకు ప్రతిష్టాత్మక "స్వకులశాలి భూషణ్" జాతీయ అవార్డును ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ, ప్రముఖులు కాంబ్లె బాలాజీ, జూజారే నాగేష్ తదితర అతిథులు ఈ పురస్కారాన్ని ప్రకటించి నాగరాజును ఘనంగా సత్కరించారు. అంతకుముందు, మహాసభల ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి రోజు నిర్వహించిన స్వకుల శాలియుల శోభాయాత్ర నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ శోభాయాత్రలో కులదైవమైన శ్రీ జిహ్వేశ్వర స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రత్యేకంగా ఒక చేనేత మగ్గాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన పురవీధుల గుండా సాగిన ఈ యాత్రలో, కదులుతున్న వాహనంపై ఏర్పాటు చేసిన మగ్గం ద్వారా నేరుగా పట్టు శాలువాలను నేస్తూ ప్రదర్శించడంతో ధర్మవరం చేనేత కళావైభవం మరోసారి జాతీయ స్థాయిలో ప్రతిధ్వనించింది. తన సృజనాత్మకతతో ధర్మవరం చేనేత పరిశ్రమకు జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు తీసుకువస్తున్న డిజైనర్ జూజారే నాగరాజుకు ఈ పురస్కారం లభించడంపై ధర్మవరం పట్టణంలోని చేనేత కార్మికులు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేశారు.

చేపల వేటలో విషాదం..

బురదలో చిక్కుకుని ఇద్దరు యువకుల దుర్మరణం



పెనుకొండ తెలుగుకలం నవంబర్ 15 : సరదాగా చేపల వేటకు వెళ్లిన ఇద్దరు యువకులు మృత్యువాత పడిన విషాద ఘటన శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం అదుదాకులపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం హోస్కోట ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు స్థానిక అదుదాకులపల్లి గ్రామ చెరువులో చేపలు పట్టేందుకు దిగి ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సెలవు దినం కావడంతో హోస్కోట ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు చేపల వేట కోసం అదుదాకులపల్లి గ్రామ చెరువు వద్దకు వచ్చారు. చేపలు పట్టేందుకు వారు చెరువులోకి దిగగా, నీటి అడుగున ఉన్న లోతైన బురద ఊబిని గమనించలేకపోయారు. ఈ క్రమంలో ముందుగా దిగిన ఓ యువకుడు ఒక్కసారిగా బురదలో కూరుకుపోయి బయటకు రాలేక కేకలు వేశాడు. అతడిని ఎలాగైనా కాపాడాలనే ఆదుర్దాతో పక్కనే ఉన్న మరో యువకుడు వేగంగా ముందుకు వెళ్లాడు. అయితే, దురదృష్టవశాత్తూ అతడు కూడా అదే బురద ఊబిలో చిక్కుకుపోయాడు. ఇద్దరూ ఎంతగా ప్రయత్నించినా బురదలోంచి కాళ్లు బయటకు తీయలేకపోయారు. చుట్టుపక్కల వారు గమనించి రక్షించే లోపే ఇద్దరు యువకులు నీట మునిగి ఊపిరాడక మృతిచెందారు. ?ఉత్సాహంగా చేపల వేటకు వెళ్లిన యువకులు ఇలా విగతజీవులుగా మారడంతో అదుదాకులపల్లి గ్రామంతో పాటు వారి స్వస్థలమైన హోస్కోటలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసే చర్యలు చేపట్టి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనాలు, పెన్షన్ పెంపు కోసం డిసెంబర్ 1న 'చలో ఢిల్లీ'కి కార్మిక సంఘాల పిలుపు



తాడిపత్రి (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : కార్మిక హక్కులను కాలరాస్తున్న నూతన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలు, అసంఘటిత రంగ కార్మికులు డిసెంబర్ 1, 2026న 'చలో ఢిల్లీ' మహాధర్నాకు పిలుపునిచ్చాయి. "ఢిల్లీ ఆక్రమణకు కదలిరండి" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ భారీ నిరసన కార్యక్రమంలో దేశంలోని నలుమూలల నుండి లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై తమ గళాన్ని వినిపించనున్నారు. కనీస వేతన చట్టాలను సక్రమంగా అమలు చేసి ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన కనీస వేతనం మరియు కనీస ఆదాయ భద్రత కల్పించాలని కార్మిక సంఘాలు ప్రధానంగా కోరుతున్నాయి. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని, కనీస పెన్షన్ మొత్తాన్ని గణనీయంగా పెంచి విశ్రాంత కార్మికులకు, వృద్ధులకు సామాజిక భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం వేతనాలు, పెన్షన్లే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ఎలాంటి గుర్తింపు లేకుండా పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మరియు అసంఘటిత రంగ కార్మికులందరినీ పూర్తిస్థాయి కార్మికులుగా గుర్తించాలని ఉద్యమకారులు పట్టుబడుతున్నారు. ?దీంతో పాటు, ఉద్యోగ భద్రత లేని తాత్కాలిక నియామకాలకు స్వస్తి పలికి, కార్మికులందరికీ అధికారికంగా ఉద్యోగ పర్మిట్లు మరియు నియామక పత్రాలు జారీ చేయాలని సంఘాల నేతలు స్పష్టం చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, శ్రామిక వర్గానికి నష్టం కలిగించేలా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించే వరకు తమ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. కాబట్టి, తమ హక్కుల సాధన కోసం డిసెంబర్ 1న జరగనున్న ఢిల్లీ మహాప్రదర్శనకు కార్మిక వర్గమంతా ఏకమై తరలిరావాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది.

పంచాయతీ పోరుకు 'పక్కా'గా సిద్ధం!

పెద్దవడుగూరులో 120 మంది ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ పూర్తి



పెద్దవడుగూరు తెలుగుకలం నవంబర్ 15 : అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో 2026 గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు వేగవంతం చేసింది. ఎన్నికల ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఆదివారం పెద్దవడుగూరులోని ఐకేపీ కార్యాలయంలో 120 మంది ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ రాముడు పాల్గొని ఎన్నికల విధులపై అధికారులకు పలు కీలక అంశాలను వివరించారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారుల బాధ్యతలు, ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ, ఎన్నికల నియమ నిబంధనలు, పోలింగ్ సమయంలో ఎదురయ్యే సాంకేతిక, పరిపాలనా సమస్యలను ఎలా పరిష్కరించాలనే అంశాలపై ఆయన సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల్లో ప్రతి అధికారి ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని శిక్షణలో స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియలో పూర్తి నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా విధులపై పూర్తి పట్టుతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీదేవి, నాగిరెడ్డి హాజరై శిక్షణ తీరును పర్యవేక్షించారు. ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని వారు సూచించారు. మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పూర్తిస్థాయిలో సిద్ధం చేయడంలో భాగంగా నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తం 120 మంది ప్రిసైడింగ్ అధికారులు ఈ శిక్షణలో పాల్గొని ఎన్నికల విధులపై పూర్తి అవగాహన పొందారు.

40 ఏళ్లుగా డ్రైనేజీ లేదు.. రోడ్లపైనే మురుగునీరు!

మల్లాపురంలో మౌలిక వసతుల లేమితో ప్రజల తీవ్ర అవస్థలు





రాయదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : అనంతపురం జిల్లా రాయదుర్గం మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో కనీస మౌలిక వసతులు కరవై ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామంలో గత 40 ఏళ్లుగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరంతా నేరుగా ప్రధాన రహదారులపైనే ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో గ్రామమంతా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు దోమల బెడద విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామస్థులు విషజ్వరాలు, ఇతర అంటువ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా అటకెక్కిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు, గ్రామానికి సమీపంలోని కొత్తూరు జమ్మిచెట్టు టర్నింగ్ వద్ద రహదారి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. మలుపు వద్ద రోడ్డుపై పెద్ద ఎత్తున కంకర పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి ఈ కంకర కుప్పలు ప్రాణసంకటంగా మారాయని, ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా గ్రామంలోని స్మశాన వాటికకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించకపోవడంతో ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని, కనీస సౌకర్యాలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దశాబ్దాలుగా తమ గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదని, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మల్లాపురంలో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, కొత్తూరు జమ్మిచెట్టు టర్నింగ్ వద్ద రోడ్డుపై ఉన్న కంకరను తొలగించి మరమ్మతులు చేపట్టాలని, స్మశాన వాటికకు రహదారి, ప్రహరీ గోడ నిర్మించి కనీస మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్థులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

బత్తలపల్లి ఎన్నికల విధుల్లో రొద్దం ఎస్సై అత్యుత్సాహం.. మీడియాపై ఆంక్షల పర్వం!

బత్తలపల్లి తెలుగుకలం నవంబర్ 15 : ఎన్నికల విధుల్లో భాగంగా బత్తలపల్లికి వచ్చిన రొద్దం ఎస్సై రాజకుల్లాయప్ప, ఎన్నికల కవరేజీ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, సాక్షి సహా మరికొంతమంది పాత్రికేయులతో దురుసుగా వ్యవహరించడం వివాదాస్పదమైంది. ఎన్నికల కేంద్రాల్లోకి పాత్రికేయులు రావడానికి వీల్లేదంటూ ఎస్సై వారిని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఎంపీడీవో జోక్యం చేసుకుని పాత్రికేయుల విధులు, ఎన్నికల కవరేజీకి సంబంధించిన నిబంధనలను ఎస్సైకి వివరించే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన ఏమాత్రం వినిపించుకోలేదు. పైగా 'మీ రూల్స్ మీవి.. మా రూల్స్ మావి' అంటూ దురుసుగా సమాధానం ఇచ్చి, పాత్రికేయులను అక్కడి నుంచి రోడ్డుపైకి పంపించేశారు. దీంతో పోలీసులకు, పాత్రికేయులకు మధ్య కొద్దిసేపు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉంటుంది. ఎన్నికల కేంద్రాల్లో భద్రతా నిబంధనలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించడం ఎంత ముఖ్యమో, విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులకు నిబంధనలను గౌరవప్రదంగా వివరించి, అనుమతించదగిన పరిధిలో సహకరించాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉంది. అయితే, ఇలా మీడియా ప్రతినిధులను కేంద్రాల్లోకి అనుమతించకపోవడంపై స్థానిక నాయకులు, ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రక్రియలో ఏదైనా గోల్‌మాల్ లేదా అక్రమాలకు పాల్పడేందుకే పాత్రికేయులను దూరంగా ఉంచారా అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే పారదర్శకత అత్యంత అవసరమని, అధికారులు మరియు పోలీసులు సమన్వయంతో వ్యవహరిస్తూ పాత్రికేయుల పట్ల సంయమనం పాటించాలని పాత్రికేయ వర్గాలు కోరుతున్నాయి.

గుంతకల్లులో ఘనంగా భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : స్థానిక ఏబీవీపీ (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) గుంతకల్లు శాఖ ఆధ్వర్యంలో వనవాసి ముద్దుబిడ్డ, ఆదివాసీల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ?ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కన్వీనర్ కేవీఎస్ఆర్ శివరాజ్ మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనులందరినీ ఏకతాటిపైకి తెచ్చి వీరోచితంగా పోరాడిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా అని కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసం, అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకల్లో ఏబీవీపీ కార్యకర్తలు వెంకటేశ్, మసన్, శంకర్ తదితరులు పాల్గొని భగవాన్ బిర్సా ముండా సేవలను స్మరించుకున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై పోలీసుల డేగకన్ను : డీఎస్పీ దైవప్రసాద్



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కళ్యాణదుర్గం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైందని డీఎస్పీ దైవప్రసాద్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సబ్‌డివిజన్ పరిధిలోని అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలను ఇప్పటికే ప్రత్యేకంగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పటిష్ఠమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ ముగిసి, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు నిరంతరాయంగా భారీ పోలీసు భద్రత కల్పిస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతేకాకుండా, పంచాయతీ ఎన్నికలు పూర్తి ప్రశాంత వాతావరణంలో, అత్యంత పారదర్శకంగా జరిగేలా పోలీసు సిబ్బంది ద్వారా గ్రామాల్లో ప్రజలకు, ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ దైవప్రసాద్ పిలుపునిచ్చారు.

సోమందేపల్లిలో కుక్కర్ పేలుడు: తృటిలో తప్పిన పెను ప్రమాదం



సోమందేపల్లి (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లి గ్రామం లోని వినాయక్ నగర్‌లో ఒక్కసారిగా ప్రెషర్ కుక్కర్ పేలిన ఘటన కలకలం రేపింది. వినాయక్ నగర్ నివాసి నాగరాజ్ నాయక్ ఇంట్లో ఈ రోజు ఉదయం వంట చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం సమయంలో ఇంట్లో పప్పు వండుతుండగా, ఒక్కసారిగా భారీ శబ్దంతో కుక్కర్ పేలిపోయింది. ఈ పేలుడు ధాటికి వంటగదిలో కుక్కర్ పైన అమర్చిన కిచెన్ చిమ్నీ పూర్తిగా ధ్వంసమై ముక్కలైంది. కుక్కర్‌లో ఉన్న పప్పు అంతా వంటగది గోడలపై, నేలపై చిందరవందరగా పడిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో వంట చేస్తున్న మహిళతో పాటు ఆమె కుమార్తె కూడా వంటగదిలోనే ఉన్నారు. అయితే అదృష్టవశాత్తూ వారిద్దరికీ ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడటంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏఎస్పీ అంకిత సురానా



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లాలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ధర్మవరం డివిజన్ పరిధిలోని నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం జిల్లా అడిషనల్ ఎస్పీ అంకిత సురానా డివిజన్లోని పలు నామినేషన్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, అక్కడి భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అవాంతరాలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక పోలీసులు తీసుకుంటున్న కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై ఏఎస్పీ అంకిత సురానా సంతృప్తి వ్యక్తం చేశారు.

కంబదూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన గోపి యాదవ్



కంబదూరు (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : అనంతపురం జిల్లా కంబదూరు పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ గా గోపి యాదవ్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీపై వచ్చిన ఆయన, పోలీస్ స్టేషన్‌లో సంబంధిత రికార్డులపై సంతకాలు చేసి తన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పలువురు గ్రామ పెద్దలు నూతన ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ గోపి యాదవ్ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తాను అత్యంత ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, అక్రమ మద్యం రవాణా మరియు ఇతర చట్టవ్యతిరేక చర్యలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తమ సమస్యలను నేరుగా పోలీస్ స్టేషనుకు వచ్చి నిర్భయంగా చెప్పుకోవచ్చని ఆయన భరోసా ఇచ్చారు.

తొలి రోజు సర్పంచులకు 309, వార్డు మెంబర్లకు 281 నామినేషన్ల దాఖలు

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ వెల్లడి

అనంతపురం తెలుగుకలం నవంబర్ 15 : గ్రామ పంచాయతీ ఎన్నికలు – 2026లో భాగంగా అనంతపురం జిల్లాలో తొలి రోజు ఆదివారం నామినేషన్ల ప్రక్రియ సందడిగా ప్రారంభమైంది. తొలి విడతలో ఎన్నికలు జరుగుతున్న అనంతపురం, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 13 మండలాలకు సంబంధించి సర్పంచ్ పదవులకు 309, వార్డు మెంబర్ పదవులకు 281 నామినేషన్ల దాఖలైనట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల వారీగా దాఖలైన నామినేషన్ల వివరాలను పరిశీలిస్తే, అనంతపురం రూరల్ మండలంలో అత్యధికంగా సర్పంచులకు 54, వార్డు మెంబర్లకు 63 నామినేషన్లు దాఖలయ్యాయి. రాప్తాడు మండలంలో సర్పంచులకు 36 మరియు వార్డు మెంబర్లకు 39 నామినేషన్లు, బొమ్మనహాల్ మండలంలో సర్పంచులకు 31 మరియు వార్డు మెంబర్లకు 39 నామినేషన్లు వచ్చాయి. ఆత్మకూరు మండలంలో సర్పంచులకు 29, వార్డు మెంబర్లకు 18 నామినేషన్లు దాఖలు కాగా, కళ్యాణదుర్గం మండలంలో సర్పంచులకు 27, వార్డు మెంబర్లకు 15 నామినేషన్లు నమోదయ్యాయి. అలాగే డి.హీరేహాల్ మండలంలో సర్పంచులకు 25, వార్డు మెంబర్లకు 36 నామినేషన్లు, కనేకల్ మండలంలో సర్పంచులకు 20, వార్డు మెంబర్లకు 37 నామినేషన్లు దాఖలయ్యాయి. శెట్టూరు మండలంలో సర్పంచులకు 17, వార్డు మెంబర్లకు 8 నామినేషన్లు; గుమ్మఘట్ట మండలంలో సర్పంచులకు 16, వార్డు మెంబర్లకు 10 నామినేషన్లు; రాయదుర్గం మండలంలో సర్పంచులకు 16, వార్డు మెంబర్లకు 8 నామినేషన్లు వచ్చాయి. బ్రహ్మసముద్రం మండలంలో సర్పంచులకు 14, వార్డు మెంబర్లకు 3 నామినేషన్లు, కుందుర్పి మండలంలో సర్పంచులకు 13, వార్డు మెంబర్లకు ఒక నామినేషన్ దాఖలు కాగా, కంబదూరు మండలంలో సర్పంచులకు 11 మరియు వార్డు మెంబర్లకు 4 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

కళ్యాణదుర్గం రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడి దుర్మరణం



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం – ముప్పలకుంట ప్రధాన రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర ఘటన రహదారిలోని టేక్ లేట్ మిట్ట సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన వేణుగోపాల్ (27) అనే యువకుడు వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, టేక్ లేట్ మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి వేణుగోపాల్ తలకు తీవ్ర గాయాలై, రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో రెండో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మరో ఇద్దరు వ్యక్తులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. చేతికి అందివచ్చిన యువకుడు మృత్యువాత పడటంతో వేణుగోపాల్ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ం

కళ్యాణదుర్గంలో ఈ నెల 18న వాహనాల బహిరంగ వేలం



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడి, స్వాధీనం చేసుకున్న నాలుగు వాహనాలకు ఈ నెల 18వ తేదీ బుధవారం నాడు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఒక

సినిమా తరహాలో నకిలీ సీబీఐ కిడ్నాప్ డ్రామా.. ముఠా గుట్టు రట్టు చేసిన మదనపల్లె పోలీసులు



మదనపల్లె (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : నకిలీ సీబీఐ ఐడీ కార్డులు, అరెస్ట్ వారెంట్ పత్రాలు, డమ్మీ పిస్టల్, సంకెళ్లతో సినిమా తరహాలో వచ్చి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసిన ముఠా గుట్టును మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు ఆదివారం రట్టు చేశారు. బాధితుడిని సురక్షితంగా విడిపించడంతో పాటు ఈ ఘటనకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ మోహన్ కుమార్, ఎస్ఐలు రహీముల్లా, రామకృష్ణారెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం, మదనపల్లె అగర్తల వీధికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సాదిక్ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మడికయ్యల శివాలయం మీదుగా మల్లికార్జున సర్కిల్ వైపు కారులో బయలుదేరారు. అదే సమయంలో కబరస్తాన్ వద్ద అతని కారును అడ్డుకున్న ముఠా సభ్యులు తాము సీబీఐ అధికారులమని, నీపై కేసు ఉందని నకిలీ సీబీఐ ఐడీ కార్డులు, అరెస్ట్ వారెంట్ చూపించారు. అనంతరం సాదిక్‌ను బలవంతంగా తమ కారులో ఎక్కించుకుని కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లాలోని ఓ ఫాంహౌస్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆయన్ను రెండు రోజుల పాటు బంధించి శారీరకంగా, మానసికంగా భయభ్రాంతులకు గురిచేశారు. కేసు నుంచి తప్పించాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించడంతో ప్రాణభయంతో వణికిపోయిన సాదిక్ తన బంధువులు, స్నేహితుల సాయంతో నిందితుల ఖాతాకు రూ.26 లక్షలు బదిలీ చేయించాడు. మరోవైపు సాదిక్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.200/2026గా కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో, ఎస్‌డీపీఓ బి.ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు మదనపల్లె-బెంగళూరు రోడ్డులో కాపుకాసిన పోలీసులు ముఠాను చుట్టుముట్టి పట్టుకున్నారు. బాధితుడు సాదిక్‌ను సురక్షితంగా విడిపించి నిందితులను స్టేషన్‌కు తరలించడంతో పాటు వారు బదిలీ చేయించుకున్న రూ.26 లక్షల బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఈ కిడ్నాప్ కేసులో చిత్తూరు కట్టమంచికి చెందిన రాజా శ్రీనివాసులు అలియాస్ ఆర్.శ్రీనివాసన్ (40), మైసూరుకు చెందిన ఎం.పి.సోహన్ భరత్ (39), బెంగళూరుకు చెందిన కె.ఎన్.సార్థక్ రాజ్ (33), చేతన్ రాజు (31), చిత్తూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన పి.సురేష్ సింగ్ (40), వేణు, గుణశేఖర్ (30)లను పోలీసులు అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు తిరుపతికి చెందిన రమణ పరారీలో ఉన్నాడు. నిందితుల వద్ద నుంచి రెండు నకిలీ సీబీఐ ఐడీ కార్డులు, ఒక డమ్మీ పిస్టల్, జత చేతి సంకెళ్లు, 22 పేజీల నకిలీ ఫైల్, కేఏ-51-ఎంఎస్-0489 నంబరు గల ఇన్నోవా క్రిస్టా కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న రమణను త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

సినిమాను మించిన స్కెచ్

కిడ్నాప్‌కు గురైన సాదిక్‌తో పాటు అరెస్టయిన నిందితులందరూ గతంలో వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నవారేనని సీఐ మోహన్ కుమార్ వెల్లడించారు. పాత కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతూ పరిచయమైన వీరంతా ఆ తర్వాత విడిపోయి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో సాదిక్ బాగా డబ్బు సంపాదించుకున్నాడని తెలుసుకున్న ముఠా, అతడిని కిడ్నాప్ చేసి డబ్బు గుంజాలని పక్కా పథకం ప్రకారం సినిమా తరహాలో స్కెచ్ వేసి ఈ దారుణానికి ఒడిగట్టింది. కాగా, ఫిర్యాదు అందిన వెంటనే చాకచక్యంగా వ్యవహరించి కేసును వేగంగా ఛేదించిన మదనపల్లె పోలీసులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సెల్‌ఫోన్‌కు బానిస కావద్దు.. పుస్తక పఠనం అలవర్చుకోండి

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తల పిలుపు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : విద్యార్థులు, యువత సెల్‌ఫోన్ వాడకానికి బానిసలు కాకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని విశిష్ట అతిథులు పిలుపునిచ్చారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం రెండవ రోజు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ అధ్యక్షతన ఘనంగా కొనసాగాయి. వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విశిష్ట అతిథులుగా విచ్చేసిన రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ నారాయణ, అనంత రక్తదానం అధినేత తరిమెల అమర్నాథ్ రెడ్డి ప్రారంభించి, సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ మాట్లాడుతూ, గ్రంథాలయాలలో విద్యార్థులు, నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ నారాయణ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని, యువత సెల్‌ఫోన్ ప్రభావానికి లోనుకాకుండా పుస్తకాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంత రక్తదానం అధినేత తరిమెల అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో అన్ని వయసుల వారిలోనూ పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సెల్‌ఫోన్‌లోనే అన్నీ లభిస్తాయని భావించడం సరికాదని, సాంకేతికత ఎంత ఉపయోగపడినా పుస్తకం విలువ ఎప్పటికీ పుస్తకానిదేనని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కవులు కళాభూషణ్ డాక్టర్ అంకె రామలింగామయ్య, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్ మధురశ్రీ, డిప్యూటీ గ్రంథాలయాధికారి పి. కమ్మన్న, సహాయ గ్రంథాలయాధికారి డి. గోవిందు, కార్యాలయ సిబ్బంది ముత్యాలమ్మ, ఇందిరమ్మ, శిరీషా, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు పెంచి విజన్ కబుర్లు చెబుతారా ధర్మాన

విజన్ 2050 పేరుతో ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారన్న ధర్మాన

నిత్యావసరాలు మరియు విద్యుత్ ఛార్జీల పెరుగుదలపై మాజీ మంత్రి మండిపాటు

జగన్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య వ్యాఖ్యల వ్యవహారం

నెల్లూరు వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో వైసీపీ మహిళా విభాగం ఫిర్యాదు

సైబర్ వేధింపులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కాకాని పూజిత డిమాండ్



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదిస్తున్న 'విజన్ 2050'పై వైసీపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. రాష్ట్రంలో ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వం కాలం గడుపుతోందని పార్టీ నేతలు ఆరోపించారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే చంద్రబాబు విజన్ 2050 గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రస్తుత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి దీర్ఘకాలిక ప్రణాళికల పేరిట ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో సామాన్యుడి కొనుగోలు శక్తి భారీగా పడిపోయిందని, ప్రజల జీవనం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని పేర్కొన్నారు. 2024 నాటి ధరలతో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసరాలు, ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయని ధర్మాన ప్రసాదరావు తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపు సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పక్కనబెట్టిన ప్రభుత్వం, బిజినెస్ సమ్మిట్‌ల పేరుతో విలువైన భూములను కారుచౌకగా ఇతరులకు కట్టబెడుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ఇలాంటి విధానాలను ప్రజలు తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమం 'ఎక్స్' స్పేసెస్‌లో అసభ్యకర వ్యాఖ్యలు చేయడంపై వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణమైన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఈ ఘటనను ఖండించకపోవడం అంటే ఆ వేధింపులను పరోక్షంగా ప్రోత్సహించడమేనని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై కాకాని పూజిత నేతృత్వంలోని పార్టీ మహిళా నేతల బృందం నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఆ ఎక్స్ స్పేసెస్ నిర్వహించిన వారు, అందులో పాల్గొని అసభ్యకరంగా మాట్లాడిన వారి వివరాలు, సాంకేతిక ఆధారాలను పోలీసులకు సమర్పించినట్లు ఆమె తెలిపారు. బాధ్యులందరిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు చేసుకోవడం సహజమేనని, ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న మహిళలను విమర్శించినా అర్థం చేసుకోవచ్చని, అయితే ప్రజా జీవితంతో ఏమాత్రం సంబంధం లేని కుటుంబ సభ్యులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం క్షమార్హం కాదని పూజిత స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న సైబర్ వేధింపులు మహిళలు, యువత, పిల్లలపై తీవ్ర మానసిక ప్రభావాన్ని చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాలను వ్యక్తిగత దూషణలకు వేదికగా మారనివ్వడం మహిళల గౌరవానికే భంగకరమని, ఇటువంటి పోకడలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు పోలీసు వ్యవస్థపై ఉందని ఆమె పేర్కొన్నారు.

బ్రేకులు పనిచేయకపోయినా 463 కిలోమీటర్లు ప్రయాణించిన వందే భారత్.. విచారణకు ఆదేశం

హాతియా నుంచి డీడీయూ దాకా బ్రేకులు లేకుండానే ప్రయాణం

లోకోపైలట్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోని కంట్రోలర్లు

కేవలం ఇంజిన్ బ్రేకులపైనే 463 కిలోమీటర్లు సాగిన వందేభారత్ రేక్

అన్ని బోగీల బ్రేకింగ్ వ్యవస్థ పనిచేయడం లేదని డీడీయూలో గుర్తింపు

ఘటనను తీవ్ర భద్రతా వైఫల్యంగా పరిగణించి విచారణకు ఆదేశించిన ఎస్ఈఆర్

భారతీయ రైల్వేలో తీవ్ర భద్రతా వైఫల్యం ఒకటి వెలుగుచూసింది. బోగీలకు సంబంధించిన బ్రేకులు ఏమాత్రం పనిచేయని స్థితిలో ఒక వందేభారత్ రైలు ఏకంగా 463 కిలోమీటర్ల మేర పట్టాలపై ప్రయాణించింది. లోకోపైలట్లు పదేపదే హెచ్చరించినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించి రైలును ముందుకు పంపించడం కలకలం రేపింది. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్టర్న్ రైల్వే (ఎస్ఈఆర్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. అక్టోబర్ 24న ఝార్ఖండ్‌లోని హాతియా నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీకి ఖాళీగా ఉన్న వందేభారత్ చైర్ కార్ రేక్‌ను ఒక గూడ్స్ ఇంజిన్ సాయంతో తరలించే ప్రక్రియ చేపట్టారు. నిబంధనల ప్రకారం కోచ్‌ల బ్రేకింగ్ వ్యవస్థను ఇంజిన్‌తో సరిగ్గా అనుసంధానించాల్సి ఉండగా, సిబ్బంది ఆ విషయాన్ని నిర్ధారించడంలో పూర్తిగా విఫలమయ్యారు. హాతియా నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే లోకోపైలట్ సాధారణ తనిఖీల్లో భాగంగా బ్రేక్ టెస్ట్ నిర్వహించారు. ఆ సమయంలో బ్రేకింగ్ సామర్థ్యం అత్యంత పేలవంగా, అసలు పనిచేయనట్లుగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తించారు. రైలు రాంచీ స్టేషన్‌కు చేరుకోగానే సెక్షన్ కంట్రోలర్, ట్రాక్షన్ లోకో కంట్రోలర్‌కు లోకోపైలట్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే, ఆ హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని అధికారులు రైలును ముందుకు సాగేందుకు అనుమతించారు. ఆ తర్వాత మురీ స్టేషన్‌లో విధుల్లోకి వచ్చిన రెండో లోకోపైలట్ కూడా ఇదే సమస్యను గుర్తించారు. బ్రేక్ పైప్ ప్రెషర్ తగ్గించినా బోగీల బ్రేకులు పడటం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ అధికారులు ఆ హెచ్చరికలను సైతం పెడచెవిన పెట్టారు. చివరకు ఉత్తర్‌ప్రదేశ్ చందౌలీ జిల్లాలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ (డీడీయూ) స్టేషన్‌కు చేరుకున్న తర్వాతే సాంకేతిక సిబ్బంది ఈ సమస్యపై దృష్టి సారించారు. అక్కడ రైలును పరిశీలించగా విస్తుపోయే నిజం బయటపడింది. రైలులోని అన్ని కోచ్‌ల బ్రేకింగ్ వ్యవస్థలు ఐసోలేట్ అయిపోయాయని, అంటే బోగీల బ్రేకులు పూర్తిగా డిస్‌కనెక్ట్ అయి ఉన్నాయని తేలింది. దీంతో హాతియా నుంచి డీడీయూ వరకు దాదాపు 463 కిలోమీటర్ల మేర ఆ రైలు కేవలం ఇంజిన్ బ్రేకులు, రీజనరేటివ్ బ్రేకింగ్ ఆధారంగానే ప్రయాణించిందని స్పష్టమైంది. తగినంత బ్రేక్ పవర్ లేకుండా ఒక రైలు ఇంత సుదీర్ఘ దూరం ప్రయాణించడం తీవ్రమైన భద్రతా లోపమని, ఇది ఆ మార్గంలో వెళ్లే ఇతర రైళ్లకు పెను ముప్పుగా మారదమే కాకుండా భారీ ప్రమాదానికి దారితీసేదని సౌత్ ఈస్టర్న్ రైల్వే పేర్కొంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి కోచ్ మెయింటెనెన్స్ సిబ్బంది, సెక్షన్ మరియు ట్రాక్షన్ కంట్రోలర్లు, ఇతర రైలు సిబ్బంది బాధ్యతను నిర్ధారించాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాంచీ డీఆర్ఎంను ఆదేశిస్తూ నవంబర్ 7న ఉత్తర్వులు జారీ చేసింది.

గిరిజనుల హక్కుల కోసం

జీవితాంతం పోరాడిన భగవాన్ బిర్సా ముండా

ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం.. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కేఎస్ఆర్ శివరాజ్



గుంతకల్లు, నవంబర్ 15 (తెలుగు కలం): గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలకులపై అలుపెరుగని పోరాటం సాగించిన మహనీయుడు భగవాన్ బిర్సా ముండా అని ఏబీవీపీ అనంతపురం జిల్లా కన్వీనర్ కేఎస్ఆర్ శివరాజ్ కొనియాడారు. ఆయన 151వ జయంతి సందర్భంగా గుంతకల్లులో ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో శివరాజ్ పాల్గొని బిర్సా ముండా చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ..భగవాన్ బిర్సా ముండా కేవలం ఒక పోరాట యోధుడే కాదని, గిరిజన సమాజంలో చైతన్యం నింపిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకుల అణచివేతకు,భూ దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనులను ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరాటానికి నాయకత్వం వహించిన ధీరుడని గుర్తుచేశారు.తన జీవితాన్ని గిరిజనుల హక్కులు,వారి భూమి, సంస్కృతి,ఆత్మగౌరవ పరిరక్షణ కోసం అంకితం చేసిన ఆయన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు.చిన్న వయసులోనే బ్రిటిష్ పాలకులకు ఎదురు నిలిచి గిరిజనుల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన బిర్సా ముండా చరిత్ర ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ముఖ్యంగా నేటి యువత ఆయన ధైర్యం,తెగువ, సమాజం పట్ల ఉన్న బాధ్యతను ఆదర్శంగా తీసుకోవాలని శివరాజ్ పిలుపునిచ్చారు. గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు భగవాన్ బిర్సా ముండా అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు వెంకటేష్, మనస్, శంకర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు

హమాలీ కాలనీలో చెత్త సేకరణ సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే చొరవతో ప్రతి ఇంటికి ట్రాక్టర్



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని హమాలీ కాలనీలో నెలకొన్న చెత్త సేకరణ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గత కొద్దిరోజులుగా కాలనీలోకి ఇంటింటి చెత్త సేకరణ వాహనం (ట్రాక్టర్) సక్రమంగా రావడం లేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై తక్షణమే స్పందించిన స్థానిక నాయకులు సమస్యను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ సహకారంతో ప్రత్యేకంగా చెత్త సేకరణ ట్రాక్టర్‌ను హమాలీ కాలనీకి రప్పించి, కాలనీలోని ప్రతి సందులోకి వెళ్లి ఇంటింటి నుంచి చెత్తను సేకరించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో చెత్త సేకరణ సిబ్బంది కాలనీలోని ప్రతి వీధిలో పర్యటించి పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించారు. స్థానిక ప్రజలకు ఎలాంటి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, ఇకపై చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా ప్రతి వీధికి వచ్చేలా చూడాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. తమ సమస్యపై తక్షణమే స్పందించి చెత్త సేకరణ ప్రక్రియను పునరుద్ధరించేందుకు సహకరించిన ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు హమాలీ కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో ఘనంగా పుస్తక ప్రదర్శన



పెద్దవడుగూరు తెలుగుకలం నవంబర్ 15 : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శన విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించే లక్ష్యంతో కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్, ఎంపీపీ మెయిన్ స్కూల్ ఉపాధ్యాయులు ఎం. వెంకట్ రెడ్డి, రామ్మోహన్, ఎస్. భాషా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అపారమైన పుస్తక సంపద అందుబాటులో ఉందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పురాతనమైన, విజ్ఞానాన్ని అందించే ఎన్నో విలువైన పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉన్నాయని, ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు రామ్మోహన్ మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనల ద్వారా గ్రంథాలయంలో ఎలాంటి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయో విద్యార్థులకు అవగాహన కలుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మరో ఉపాధ్యాయులు ఎం. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పుస్తకానికి ఒక పాఠకుడు ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాహిత్యం, విజ్ఞానం, చరిత్రతో పాటు వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవాలని తెలిపారు. ఏ పుస్తకమూ తక్కువ కాదని, చిన్న పుస్తకం చదివినా ఎంతో విలువైన జ్ఞానాన్ని సంపాదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎన్. భాషా, గ్రామ పెద్దలు బి. నారాయణ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో మొత్తం 28 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతో

మమేకమైన మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ చినబాబు



మదనపల్లె (తెలుగు కలం) (నవంబర్ 15) : ప్రతినిధి : పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులతో మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ చినబాబు మమేకమవుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఇంద్రానగర్ మున్సిపల్ మస్టర్ కేంద్రంతో పాటు సాయిటీ కాలనీ, సాయిటీ కాలనీ పార్కును సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని, వాటి పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, అలాగే ఇళ్లు లేని పేదల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. అవినీతికి తావులేని పారదర్శక పాలనతో మదనపల్లెను ఒక ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్మన్ పిలుపునిచ్చారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కార్మికులు, నాయకులు, ప్రజలు అందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని శ్రీరామ్ చినబాబు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగారపు రామ్మూర్తి నాయుడు, టీడీపీ నాయకులు రఫీ, 34వ వార్డు కౌన్సిలర్ రంగస్వామి నాయుడు, 32వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తలారి రాధ, 40వ వార్డు కౌన్సిలర్ శివకుమారి భాస్కర్, 33వ వార్డు కౌన్సిలర్ రవి నాయక్, 46వ వార్డు కౌన్సిలర్ ప్రభు గౌడ్, ఐటీడీపీ అధ్యక్షుడు కాశీ శ్రీరామ్ వాల్మీకి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, నియోజకవర్గ జనరల్ సెక్రటరీ బోనాల ఉమేష్, సాయి, రేగడి ప్రసాద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

తిరుపతి రైల్వేస్టేషన్‌కు అంతర్జాతీయ సొబగులు చివరి దశకు ఆధునికీకరణ పనులు

ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుపతిలో రైల్వేస్టేషన్ సరికొత్త సొబగులద్దుకుంటోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేలా ఆధునిక హంగులతో సిద్ధమవుతోంది.ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుపతిలో రైల్వేస్టేషన్ సరికొత్త సొబగులద్దుకుంటోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేలా ఆధునిక హంగులతో సిద్ధమవుతోంది. సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణికులు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా రైల్వే స్టేషన్ ముఖచిత్రం మారబోతోంది. అంతర్జాతీయ స్థాయి స్టేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.342 కోట్లతో చేపట్టిన పనులు చివరి దశకు చేరుకున్నాయి.రోజూ 1.50లక్షల మంది ప్రయాణికులు : తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. విమానాశ్రయాలకు దీటుగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పనులు చేపట్టింది. తిరుపతి మీదుగా రోజూ దాదాపు 90 రైళ్ల ద్వారా 80వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల ద్వారా ఇకపై 1.50 లక్షల మంది ప్రయాణికులు సులభంగా, సౌకర్యవంతంగా రాకపోకలు సాగించనున్నారు. రూ.342 కోట్లతో నాలుగేళ్ల క్రితం



అభివృద్ధి, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. రైల్వేస్టేషన్ దక్షిణ ప్రవేశద్వారంతో పాటు నూతన భవనం, ఉత్తరం వైపు ప్రవేశద్వారం ఆధునికీకరణ పనులు చేపట్టారు. దక్షిణం వైపు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఉత్తరం వైపు పనులు తుది దశకు చేరుకున్నాయి.అత్యాధునిక వెయిటింగ్ హాళ్లు, స్టాల్స్ : దక్షిణం వైపు విశాలమైన అప్రోచ్ రోడ్లతో పాటు మూడంతస్తుల ప్రధాన భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండో అంతస్తులో ప్రయాణికుల కోసం అత్యాధునిక వెయిటింగ్ హాళ్లు, స్టాల్స్,ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. మూడో అంతస్తును రైల్వే కార్యాలయాల కోసం కేటాయించారు. ఉత్తరం వైపు స్టేషన్ భవనాన్ని 3 అంతస్తులతో అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 3 లిఫ్టులు, 5 ఎస్కలేటర్లకు అదనంగా 25 లిఫ్టులు, 21 ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఫేజ్-2లో భాగంగా దక్షిణం వైపు ఉన్న మూడంతస్తుల భవనంపై మరో 10 అంతస్తుల భారీ భవనాన్ని నిర్మించనున్నట్లు స్టేషన్ డైరెక్టర్ తెలిపారు.“విమానాశ్రయాలకు దీటుగా తిరుపతి రైల్వేస్టేషన్?ను అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మంచి అనుభూతిని కలిగించే విధంగా రైల్వేస్టేషన్ ఉంటుంది. 2027 మార్చి చివరికి నాటికి ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తాం. అనంతరం రోజూ లక్షన్నర మంది సౌకర్యవంతంగా రాకపోకలు సాగించవచ్చు.” - రంజిత్‌కుమార్, తిరుపతి రైల్వేస్టేషన్ డెరెక్టర్ తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు మరో 5 నెలల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు. స్టేషన్ ఆధునికీకరణ, అభివృద్ధి పనులు పూర్తయితే తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి.

టర్న్‌పై ఊరి పోరు బ్యాలెట్‌బాక్సులో కరపత్రంతో వార్తల్లో నిలిచిన గ్రామం

బ్యాలెట్ పేపర్‌తోపాటు కరపత్రాన్ని వేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది ఆ గ్రామం! ఇంతకీ ఆ ఊరి సమస్యేంటి ప్రభుత్వం ఏం చేయబోతోంది బ్యాలెట్‌బాక్సులో కరపత్రంతో వార్తల్లో నిలిచిన కంకణాలపల్లి500 కుటుంబాలు, 2 వేల జనాభా, 15 వందల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న ఆ ఊరికి సమస్యొచ్చింది. మొర ఆలకించే నాథుడు లేక పరిషత్ ఎన్నికల్ని ఆసరాగా చేసుకుంది. బ్యాలెట్ పేపర్‌తోపాటు కరపత్రాన్ని వేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఇంతకీ ఆ ఊరి సమస్యేంటి ప్రభుత్వం ఏం చేయబోతోందిముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న గ్రామస్థులు : ఈ నెల 7న పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో వార్తల్లోకెక్కిన ఊరు కంకణాలపల్లి. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి 4 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. ఈ ఊరెళ్లే మార్గంలో రైల్వే గేట్ నంబర్ 41 వద్ద ఖ-ఆకారంలో, అండర్ పాస్ నిర్మిస్తున్నారు. దీన్ని గ్రామస్థులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారిలోనే నేరుగా =ఖదీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.ఐదారు నెలలుగా, శాంతియుత ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు మొర పట్టుకున్నారు. కలెక్టర్‌నూ కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. అయినా సానుకూల స్పందన లేదు. రాష్ట్రస్థాయిలో చర్చ జరిగితే తప్ప ప్రభుత్వం తమ మొర ఆలకించదని భావించిన గ్రామస్థులు పరిషత్ ఎన్నికల ఓటింగ్‌లో తమ సమస్యపై కరపత్రాలను ముద్రించి ఓటుతోపాటు బ్యాలెట్ బాక్సులో వేశారు. ఆకారంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తే రైతులు నుంచి రోజూ చదువుల కోసం వెళ్లే విద్యార్థులూ ఇబ్బంది పడతారన్నది గ్రామస్థుల ఆవేదన.“గ్రామంలో ఖ-ఆకారంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తే అందరికీ ఇబ్బందులే. ఇక్కడ రైతుల నుంచి రోజూ చదువుల కోసం వెళ్లే విద్యార్థుల వరకు నిత్యం రైల్వే గేట్ ద్వారానే ప్రయాణిస్తాం. వర్షాలు ఎక్కువైనప్పుడు నీరంతా అక్కడే నిలుస్తుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయి. అలాగే రాత్రి సమయంలో ఆ దారిలో నడిచే ఆడపిల్లలు ఇబ్బందులు పడతారు. రైతులు పండించిన పంటలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి.” - గ్రామస్థులు, కంకణాలపల్లిరెండు నెలల క్రితం సీఎం చంద్రబాబును కలిసి తమ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. సీఎం పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, కొన్ని రోజుల క్రితం



పనులు మొదలవడంతో ఏం చేయాలో తెలియక వినూత్న నిరసన బాట పట్టారు.స్పందించిన ఎన్నికల కమిషనర్ : కంకణాలపల్లి గ్రామస్థులు బ్యాలెట్ బాక్స్‌లో కరపత్రాలు వేసిన విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పందించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు ఇలా అధికారుల దృష్టికి తీసుకురావడం సాధారణమేనన్నారు. ప్రజల విజ్ఞప్తిని సంబంధిత జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రాణ స్నేహితుడిపై ప్రతీకారం ఆన్‌లైన్‌లో కత్తి ఆర్డర్ చేసి, ఆపై మాటువేసి దారుణ హత్య

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో పాత గొడవలతో ఓ యువకుడు తన స్నేహితుడిని కత్తితో దాడిచేసి హతమార్చాడు. వీరిద్దరి మధ్య చిన్న గొడవ కాస్తా ప్రాణాలు తీసుకొనేంతవరకు వెళ్లిందిఒక చిన్న నిప్పురవ్వ పెద్ద అగ్నిప్రమాదానికి కారణమైనట్టు, చిన్న గొడవ ఒక్కోసారి ప్రాణాల మీదకు తెస్తుంది. స్నేహితుల మధ్య అయితే ఇలాంటి చిన్నాచితకా గొడవలు సర్వసాధారణమే. కానీ మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య చెలరేగిన చిన్న తగాదా కత్తి దాడి వరకు వెళ్లింది. గాయం నుంచి బయటపడిన వ్యక్తి, తనపై దాడిచేసిన స్నేహితుడిపై పగబట్టాడు. కొన్నాళ్లకు ఆ గొడవ సద్దుమణిగినా అతని ప్రతీకార జ్వాల మాత్రం ఆరలేదు. రెండు నెలలపాటు ప్రతీకారం కోసం ఎదురుచూసి, చివరకు అదును చూసి ప్రాణాలు తీశాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ బంజారాహిల్స్‌లో జరిగింది.

స్నేహితుల మధ్య చిచ్చుపెట్టిన చిన్న గొడవ

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్-2 లోని షౌకత్‌నగర్‌కు చెందిన 24 ఏళ్ల ఐమన్ పాషా, 28 ఏళ్ల ఫరూఖ్ ఇద్దరూ ప్రాణ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడ్డ వీరు నేరాలు చేయడంలో భాగస్వాములయ్యారు. కలిసి మద్యం తాగడం, జల్సాలు చేయడం వీళ్ల దినచర్య. అయితే ఆ స్నేహమే వాళ్ల పాలిట శాపంగా మారింది. రెండు నెలల క్రితం మద్యం మత్తులో ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఆ కోపంలో ఐమన్ పాషా వీపుపై పోర్క్‌తో ఫరూఖ్



దాడి చేసి గాయపరిచాడు. ఈ గొడవకు సంబంధించి ఫరూఖ్ శిక్ష కూడా అనుభవించాడు. ఐమన్ పాషా కోపంతో తగ్గకపోగా, అదికాస్తా ఫరూఖ్‌పై పగగా మారింది. అతన్ని ఎలా అయినా అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఆన్‌లైన్‌లో కత్తిని ఆర్డర్ చేసుకొని

పగతో రగిలిపోతున్న ఐమన్ పాషా ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా ఆన్‌లైన్‌లో ఓ కత్తిని ఆర్డర్ చేశాడు. రోజూ ఫరూఖ్ కదలికలను గమనిస్తూ అనువైన సమయం కోసం ఓపికగా ఎదురుచూశాడు. తాను దాడి చేస్తే ఫరూఖ్‌కు ఏమాత్రం తప్పించుకునే అవకాశం ఉండకూడదని అనుకున్నాడు. రోజులు గడుస్తున్నాయి, ఫరూఖ్ పాత గొడవను మర్చిపోయి తన పనుల్లో తాను నిమగ్నమయ్యాడు. కానీ ఐమన్ పాషా మాత్రం తన కత్తికి ఎప్పుడు పని చెబుదామా అని రగిలిపోతూనే ఉన్నాడు.

కత్తితో వీపుపై పొడిచి, పోలీసులకు లొంగిపోయి

చివరికి నవంబర్ 8వ తేదీన ఐమన్ పాషాకు ఆ అవకాశం దొరికింది. సాగర్ సొసైటీ చౌరస్తాలోని ఓ టపాసుల దుకాణం దగ్గరకు ఫరూఖ్ వచ్చినట్లు ఐమన్‌కు తెలిసింది. వెంటనే అక్కడికి చేరుకొని మాటు వేశాడు. ఫరూఖ్ ఏమరుపాటుగా ఉన్న సమయం చూసి ఒక్కసారిగా వెనుక నుంచి వీపుపై బలంగా పొడిచాడు. తీవ్రగాయాలైన ఫరూఖ్ రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. పగ తీర్చుకున్న ఐమన్ పాషా నేరుగా వెళ్లి బంజారాహిల్స్ పోలీసుల ముందు లొంగిపోయాడు. ఐమన్ పాషాపై ఇప్పటికే అల్లాపూర్, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లలో రెండు మర్డర్ కేసులు, దారి దోపిడీ కేసులు ఉన్నట్లు తేలింది. చనిపోయిన ఫరూఖ్‌పై కూడా దారిదోపిడీ, హత్యాయత్నం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.నాలుగు నెలల క్రితం మద్యం తాగి, హోటల్‌లో తినేటపుడు ఐమన్ పాషా వీపుపై పోర్క్‌తో ఫరూఖ్ దాడి చేశాడు. ఆ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించాం. ఆ ఘటనపై ప్రతికారం పెంచుకున్న ఐమన్ పాషా ఫరూఖ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో ఫరూఖ్ ప్రాణాలు కోల్పోయాడు - శ్రీకాంత్, డీసీపీచిన్నపాటి గొడవ చివరకు ఇద్దరు స్నేహితులను విడదీసింది. క్షణికావేశంలో చేసిన దాడి చివరకు ప్రాణాలు తీసే పగగా మారింది. ఫలితంగా ఒకరు ప్రాణాలు కోల్పోగా మరొకరు జైలుపాలయ్యారు.

ఓఆర్ఆర్‌పై అస్తవ్యస్త పార్కింగ్ ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌పై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలపడంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై పర్యవేక్షణ గాలిలో దీపంలా మారుతోంది. ప్రధాన రహదారిపై వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తున్నప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అటుగా వచ్చే వాహనదారులకు ఇక్కడ నిలిపి ఉంచిన వాహనాలు సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.ఇటీవల కార్మికులను తరలిస్తున్న ఒక వాహనం ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఎనిమిది లేన్ల ప్రధాన రహదారిపై ఎక్కడా వాహనాలను పార్కింగ్ చేయడానికి అనుమతి లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు గానీ, హైదరాబాద్ ఓఆర్ఆర్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు గానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

రూ.8.26 కోట్లతో ప్రాజెక్టు

ప్రస్తుతం ఓఆర్ఆర్‌పై పోలీసులు, హెచ్‌జీసీఎల్ బృందాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ప్రతిరోజూ 2,50,000 కు పైగా వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో ప్రమాదాలను తగ్గించడానికి, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారికి జరిమానాలు విధించేందుకు సైబరాబాద్ పోలీసులు హెచ్‌జీసీఎల్ సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మల్టీ-వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్ (ఎంవీడీఎస్)ను ప్రవేశపెట్టాయి. ఈ వ్యవస్థను మొత్తం రూ.8.26 కోట్ల నిధులు వెచ్చించి ఏర్పాటు చేశారు.

14 ప్రాంతాల్లో ఎంవీడీఎస్ వ్యవస్థ

తరచుగా ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగే శంషాబాద్ టూ మేడ్చల్ మార్గంలోని 14 ప్రాంతాల్లో ఈ ఎంవీడీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థలోని ఏఐ కెమెరాల ప్రత్యేకత ఏమిటంటే ఇవి ట్రాఫిక్ ఉల్లంఘనలను రియల్ టైంలో గుర్తించి, వారిపై చర్యలు తీసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అయితే ఈ వ్యవస్థను బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, సైబరాబాద్ కమిషనరేట్‌తో అనుసంధానించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ అనుసంధానం ఉంటేనే 'ఈ-చలాన్'లను వెంటనే జారీ చేయడం సాధ్యమవుతుంది.

70 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే ఏర్పాటు



ప్రతి ప్రాంతంలో నాలుగు కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కెమెరా 16 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తిస్తుంది. అతివేగం, అక్రమ పార్కింగ్ వంటి ఉల్లంఘనలను గుర్తించి, ఆ సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెంటనే చేరవేస్తామని చెప్పినప్పటికీ, అది ఇంకా అమల్లోకి రాలేదు. అంతేకాకుండా మొత్తం 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్ మార్గంలో కేవలం 70 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మిగిలిన దూరానికి సంబంధించి ఎటువంటి ప్రణాళికలు లేవు.

నటుడు గిరిబాబు మృతిపట్ల సంతాపం కరీంనగర్ నాటి ర్యాలీని గుర్తుచేసుకున్న అభిమానులు

ప్రముఖ నటుడు గిరిబాబు మృతిపట్ల కరీంనగర్ జిల్లాలోని అభిమానులు సంతాపం తెలిపారు. తమ ప్రాంతంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.ప్రముఖ నటుడు, నిర్మాత, డైరెక్టర్ గిరిబాబు మృతిపట్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సినీ అభిమానులు, కళాకారులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 34 ఏళ్ల కిందట ఆయన కరీంనగర్‌లో పర్యటించిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 1992లో వయోజన విద్య ప్రాజెక్టు సంచాలకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆ సమయంలో 'ఏంటి బావా మరీనూ!' సినిమా షూటింగ్ పట్టణ పరిసరాల్లో జరుగుతోంది. ఈ సందర్భంగా అధికారులు చేసిన విజ్ఞప్తి మేరకు నటుడు గిరిబాబు జెండా పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. అక్షరాస్యత పెంపుపై ప్రజల్లో విస్తృత అవగాహనకు చేపట్టిన కార్యక్రమానికి నగరవాసులతో కలిసి ఆయన ఉత్సాహంగా హాజరయ్యారు. ఆయనతోపాటు దర్శకుడు రేలంగి నరసింహారావు, కరీంనగర్‌కు చెందిన చిత్ర నిర్మాతలు ఎస్.వి.రావు, చందన్‌రాజ్, నటి సింధూజ అధికారులు పాల్గొన్నారు.1992లో కరీంనగర్‌లో నిర్వహించిన వయోజన విద్య అవగాహన ర్యాలీలో

గిరిబాబు కరీంనగర్‌తో గిరిబాబుకు అనుబంధం

'ఏంటి బావా మరీనూ!' సినిమా షూటింగ్ సమయంలో నటుడు గిరిబాబు కరీంనగర్‌లో 15 రోజులు గడిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటించినట్లు నిర్మాత చందన్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు శనివారం కరీంనగర్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో గిరిబాబు ఫొటోకు పూలమాల



వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు లక్ష్మీగౌతమ్, ముజాఫర్, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. 600కు పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని చిరంజీవి కుటుంబ అభిమాన సంఘాల నాయకులు మిడిదొడ్డి నవీన్, అంజియాదవ్‌లు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

600కుపైగా సినిమాల్లో నటన

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా రావినూతల గ్రామంలో 1946 జూన్ 8న గిరిబాబు జన్మించారు. ఆయన అసలు పేరు యర్రా శేషగిరిరావు. రైతు కుటుంబంలో జన్మించిన గిరిబాబు చిన్నప్పటి నుంచే సినిమాలపై ఆసక్తి ఉండేది. ఊరిలోని టూరింగ్ టాకీస్‌లోనే గిరిబాబు అధిక సమయం గడిపేవారట! దీంతో గ్రామంలో ఆయనను అందరూ 'సినిమా పిచ్చోడు' అనే వారట. రంగస్థలం నుంచి గిరిబాబు తన నట ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో గిరిబాబు సినీరంగంలోకి తెరంగేట్రం చేశారు.ఆ తర్వాత కురుక్షేత్రం, దేవతలారా దీవించండి, మా దైవం, 'భైరవద్వీపం' సినిమాలు కెరీర్ ప్రారంభంలో గిరిబాబుకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ఆయన నటించిన సినిమాల్లో 'కితకితలు', 'ఎవడైతే నాకేంటి', 'అతడు', 'నువ్వే కావాలి', 'అల్లుడా మజాకా', 'సిసింద్రి', 'ప్రేమలేఖలు', 'ప్రతినిధి', 'మిస్టర్ అండ్ మిసెస్ శైలజ కృష్ణమూర్తి', 'అ ఆ', 'గీత గోవిందం'లో నటించి ప్రేక్షకులను అలరించారు. ఆవిధంగా 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సినీ కెరీర్‌లో 600కు పైగా చిత్రాల్లో విలన్, కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించారు.

వరాహ నదిలో గల్లంతైన ముగ్గురు యువకులు మృతి హైవేపై బంధువుల ఆందోళన



అనకాపల్లి జిల్లాల్లో వరాహ నదిలో స్నానానికి దిగి గల్లంతైన ముగ్గురు యువకులు మృతిచెందారు. మృతదేహాలను ఒడ్డుకుచేర్చి బంధువులకు పోలీసులు అప్పగించారు. అనకాపల్లి జిల్లాలో వరాహ నదిలోకి స్నానానికి వెళ్లి గల్లంతయిన ముగ్గురు యువకులు మృతి చెందారు. ఆదివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు మృతదేహాలను ఒడ్డుకు చేర్చి బంధువులకు అప్పగించారు. ఎస్?.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద శనివారం సాయంత్రం వరాహ నదిలో ఆరుగురు యువకులు స్నానానికి దిగారు. ముగ్గురు సురక్షితంగా బయటకు రాగా కాతేటి రిషి (18), ముప్పిడి నాగవంశీ (22), కోడి జగదీశ్ (20) గల్లంతయ్యారు.నదిలో ముమ్మరంగా గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం వారి మృతదేహాలు నదిలో తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు, పోలీసులు బయటకు తీసుకొచ్చారు. యువకులు క్షేమంగా తిరిగి వస్తారని ఎదురుచూడగా విగతజీవులుగా మారడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహాలను తహసీల్దార్ రమేశ్‌బాబు, సీఐ రామకృష్ణ, ఎస్సై రమేశ్ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని దళిత కాలనీవాసులు కోరారు.ముగ్గురి యువకులు నదిలో కొట్టుకుపోయి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోల్?కతా - చెన్నై జాతీయ రహదారిపై వారి బంధువులు ఆందోళన చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఎస్. రాయవరం, నక్కపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు.

ఇంజినీరింగ్‌లో భర్తీ కాని సీట్లు మెకానికల్, సివిల్ బ్రాంచీలకు కోత



రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ ఏడాది 75 వేలకుపైగా సీట్లు మిగిలిపోయాయి. మెకానికల్, సివిల్ బ్రాంచీల్లో సీట్లకు విద్యాసంస్థలు కోతపెడుతున్నాయి.ఇంజినీరింగ్ విద్యకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నా కళాశాలల్లో సీట్లు మాత్రం నిండటంలేదు. వర్సిటీల ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు. ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల కంటే ఇంజినీరింగ్ సీట్లే అధికంగా ఉన్నాయి. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వేగాన్ని తట్టుకోలేక కొన్ని విద్యాసంస్థలు మెకానికల్, సివిల్ కోర్సుల్లో సీట్లు తగ్గించేశాయి. ఫలితంగా అన్ని కోర్సుల్లో కలిపి 62.34 శాతం సీట్లు మాత్రమే నిండాయి.రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ ఏడాది 75 వేలకు పైగా సీట్లు మిగిలిపోయాయి. ప్రభుత్వం భర్తీచేసే కన్వీనర్, యాజమాన్యాలు కేటాయించే స్పాట్, కేటగిరీ-బీలోనూ సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మొత్తం 2,00,257 ఇంజినీరింగ్ సీట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అన్ని కేటగిరీల్లో కలిపినా 1,24,851 సీట్లు అంటే, 62.34 శాతం మాత్రమే నిండాయి.ప్రభుత్వం భర్తీచేసే కన్వీనర్ కోటాలో 1,52,731 సీట్లకు 98,406 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. కన్వీనర్ కోటాలో మిగిలిన 49,344 సీట్లను స్పాట్ కోటాలో భర్తీ చేసుకునేందుకు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు అవకాశమివ్వగా, అప్పుడూ 1,498 సీట్లు మాత్రమే నిండాయి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ కళాశాలల్లో 2,446 సీట్లు మిగిలాయి. వీటిని స్పాట్ కోటా కింద భర్తీ చేసుకునేందుకు అవకాశమివ్వాలని కొన్ని వర్సిటీలు కోరుతున్నా, సాంకేతిక విద్యలో నాణ్యత తగ్గిపోతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం అనుమతివ్వటం లేదు. సాధారణ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గిపోతుండటంతో అన్ని విశ్వవిద్యాలయాలు ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభించాయి. చాలావాటిలో రెగ్యులర్ అధ్యాపకులు లేక కాంట్రాక్టు వారితోనే నెట్టుకొస్తున్నాయి. అందుకే కొన్ని వర్సిటీల ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు.'ప్రైవేట్'లో 70 వేలకుపైనే సీట్లు: ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు సీట్లను ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య కంటే ఇంజినీరింగ్ సీట్లే అధికంగా ఉంటున్నాయి. ఈఏపీసెట్ ఎంపీపీ స్ట్రీమ్‌లో 1.82 లక్షల మంది అర్హత సాధించగా, ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు 1.13 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కౌన్సెలింగ్‌లో బ్రాంచీలు, కళాశాలల వెబ్‌ఐచ్ఛికాల నమోదుకు 1.12 లక్షల మంది అర్హత సాధించారు. కన్వీనర్ కోటా సీట్లు 1.52 వేలు ఉన్నాయి. వీటికి యాజమాన్య కోటా సీట్లు అదనం. ప్రైవేట్ కళాశాలల్లోనే 70 వేలకుపైగా సీట్లు మిగిలాయి.సాఫ్ట్‌వేర్ కోర్సుల్లోనే 69% సీట్లు: ఇంజినీరింగ్‌లో సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో అత్యధికంగా 68.53 శాతం సీట్లు ఉన్నాయి. కోర్ ఇంజినీరింగ్‌లో సివిల్, మెకానికల్ వంటి బ్రాంచీల్లో ఉద్యోగావకాశాలు తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో చేరేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. 2,00,257 సీట్లకుగాను 'సాఫ్ట్‌వేర్' కోర్సుల్లోనే 1,37,254 సీట్లు దర్శనమిస్తున్నాయి. వీటిలోనూ 85,275 సీట్లు మాత్రమే నిండాయి. ఈ ఏడాది కొన్ని వర్సిటీలు, కళాశాలలు 'క్వాంటమ్ కంప్యూటింగ్' ప్రారంభించాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో 59,630 సీట్లకు 33,552, సివిల్ ఇంజినీరింగ్‌లో 7,634 సీట్లకు 4,142, మెకానికల్‌లో 9,648 సీట్లకు 5,713 నిండాయి. అన్ని విద్యాసంస్థలు మెకానికల్, సివిల్ కోర్సుల్లో సీట్లు తగ్గించేశాయి.

డబ్బులడిగితే నీ ఫొటోలు బయటపెడతా వ్యాపార లావాదేవీల పేరిట మహిళపై లైంగిక దాడి!



వ్యాపారా లావాదేవీల్లో మహిళకు నిందితుడు పరిచయమయ్యాడు. వారి మధ్య వ్యాపార బకాయిల చెల్లింపుల విషయంలో వివాదాలొచ్చాయి. దీంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన నిందితుడు లైంగికదాడికి పాల్పడ్డాడు.వ్యాపార లావాదేవీల ద్వారా పరిచయమైన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆమెను లైంగికంగా వేధించి, వ్యక్తిగత ఫొటోలను బయటపెడతానని బెదిరించినట్లు వచ్చిన

నిర్జలీకరణ సమస్యతో ఇబ్బంది పడుతున్నారా..

వెంటనే ఈ అలవాట్లకు గుడ్ బై చెప్పండి..

చాలా సార్లు మనం తినే ఆహారం పట్ల శ్రద్ధ చూపము. దీనివల్ల శరీరం నిర్జలీకరణ సమస్య బారిన పడుతుంది. ఈ సమయంలో తలతిరుగడం, బలహీనత వంటి సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. ఇది ఎక్కువగా శరీరంలో నీటి కొరత ఏర్పడినప్పుడు జరుగుతుంది. కనుక శరీరంలో నిర్జలీకరణ సమస్య రాకుండా ఉండటానికి పొరపాటున కూడా కొన్ని రకాల ఆహార పదార్థాలను తినొద్దు. ఎందకంటే కొన్నిరకాల ఆహార పదార్థాలను ఎందుకు తినొద్దో తెలుసుకుందాం. వేసవి కాలంలో మాత్రమే కాదు ఒకొక్కసారి వివిధ కారణాల వలన శరీరంలో నీటి లోపం ఏర్పడడం సర్వసాధారణం. వేసవిలో చెమట ద్వారా శరీరం నుంచి నీరు బయటకు విసర్జింపబడుతుందని సీనియర్ వైద్యుడు డాక్టర్ కమల్‌జిత్ సింగ్ కైంత్ అన్నారు. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి తగినంత నీరు అవసరం. అయితే శరీరంలో నీటి కొరత ఏర్పడినప్పుడు నిర్జలీకరణ ప్రమాదం పెరుగుతుంది. అయితే శరీరంలో నీటి లోపం కలిగించే కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని మీకు తెలుసా వీటిని వేసవి కాలంలో మాత్రమే కాదు.. ఏ కాలంలోనైనా సరే ఈ ఆహార పదార్థాలను అధిక మొత్తంలో తిన్నా.. తాగినా అనేక ఇబ్బందులను ఎదుర్కొనాల్సి ఉంటుంది. వేసవి కాలంలో మాత్రమే కాదు ఒకొక్కసారి వివిధ కారణాల వలన శరీరంలో నీటి లోపం ఏర్పడడం సర్వసాధారణం. వేసవిలో చెమట ద్వారా శరీరం నుంచి నీరు బయటకు విసర్జింపబడుతుందని సీనియర్ వైద్యుడు డాక్టర్ కమల్‌జిత్ సింగ్ కైంత్ అన్నారు. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి తగినంత నీరు అవసరం. అయితే శరీరంలో నీటి కొరత ఏర్పడినప్పుడు నిర్జలీకరణ ప్రమాదం పెరుగుతుంది. అయితే శరీరంలో నీటి లోపం కలిగించే కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని మీకు తెలుసా వీటిని వేసవి కాలంలో మాత్రమే కాదు.. ఏ కాలంలోనైనా సరే ఈ ఆహార పదార్థాలను అధిక



మొత్తంలో తిన్నా.. తాగినా అనేక ఇబ్బందులను ఎదుర్కొనాల్సి ఉంటుంది.వేసవిలో కారంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే వాటిలో అదనపు నూనె ఉండటం వల్ల పదే పదే దాహం వేస్తుంది . కాప్సైసిన్ కూడా కారంలో ఉండే పదార్థాలలో ఉంటుంది. ఇది ఆరోగ్యానికి హానికరం. ఇది మీకు డీహైడ్రేషన్‌కు కారణమవుతుంది. వేసవిలో కారంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే వాటిలో అదనపు నూనె ఉండటం వల్ల పదే పదే దాహం వేస్తుంది . కాప్సైసిన్ కూడా కారంలో ఉండే పదార్థాలలో ఉంటుంది. ఇది ఆరోగ్యానికి హానికరం. ఇది మీకు డీహైడ్రేషన్‌కు కారణమవుతుంది.వాస్తవానికి డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. అయినప్పటికీ వేసవిలో లేదా ఇతర సమయాల్లో కూడా అధిక మొత్తంలో తీసుకోవద్దు. ఎందుకంటే వీటి స్వభావంచాలా వేడిగా ఉంటుంది, దీని కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది . శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది. వాస్తవానికి డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. అయినప్పటికీ వేసవిలో లేదా ఇతర సమయాల్లో కూడా అధిక మొత్తంలో తీసుకోవద్దు. ఎందుకంటే వీటి స్వభావంచాలా వేడిగా



ఉంటుంది, దీని కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది . శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది.చాలా మంది కాఫీని ఇష్టపడతారు ఎందుకంటే ఇది అలసట ,బద్ధకాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. తక్షణ శక్తిని ఇస్తుంది. అయితే ఈ కాఫీని ఎక్కువగా తాగడం వలన శరీరంలో నిర్జలీకరణం ఏర్పడుతుంది. శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. అజీర్ణ సమస్యకు కూడా కారణమవుతుంది. చాలా మంది కాఫీని ఇష్టపడతారు ఎందుకంటే ఇది అలసట ,బద్ధకాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. తక్షణ శక్తిని ఇస్తుంది. అయితే ఈ కాఫీని ఎక్కువగా తాగడం వలన శరీరంలో నిర్జలీకరణం ఏర్పడుతుంది. శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. అజీర్ణ సమస్యకు కూడా కారణమవుతుంది.

కొంత మంది దాహార్తిని తీర్చుకునేందుకు వేసవి కాలంలో అధిక మొత్తంలో శీతల పానీయాలు తీసుకుంటారు ఎందుకంటే ఈ శీతల పానీయాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. అయితే వాటిలో చాలా చక్కెర ఉంటుంది. అందువలన ఈ శీతల పానీయాలను ఎంత తాగినా దాహం కలుగుతూనే ఉంటుంది. అంతేకాదు వీటిని తాగడం వలన శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది. కొంత మంది దాహార్తిని తీర్చుకునేందుకు వేసవి కాలంలో అధిక మొత్తంలో శీతల పానీయాలు తీసుకుంటారు ఎందుకంటే ఈ శీతల పానీయాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. అయితే వాటిలో చాలా చక్కెర ఉంటుంది. అందువలన ఈ శీతల పానీయాలను ఎంత తాగినా దాహం కలుగుతూనే ఉంటుంది. అంతేకాదు వీటిని తాగడం వలన శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది.బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి వేయించిన ఆహారాలు వేసవిలో తినకూడదు. ఎందుకంటే ఇవి నూనె అధికంగా ఉండే ఆహారాలు. అంతేకాదు వీటిల్లో అధిక ఉప్పు కంటెంట్ కలిగి ఉంటుంది. దీని కారణంగా బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహార పదార్థాలను తినడం వలన నిర్జలీకరణ సమస్యను పెంచుతాయి. బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి వేయించిన ఆహారాలు వేసవిలో తినకూడదు. ఎందుకంటే ఇవి నూనె అధికంగా ఉండే ఆహారాలు. అంతేకాదు వీటిల్లో అధిక ఉప్పు కంటెంట్ కలిగి ఉంటుంది. దీని కారణంగా బర్గర్లు, సమోసాలు , ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహార పదార్థాలను తినడం వలన నిర్జలీకరణ సమస్యను పెంచుతాయి.



ఈ తప్పులు చేస్తున్నారా..? అయితే, మీ ఎముకలు గుల్లయినట్లే.. ఇక మున్ముందు కష్టమే..

ఎముకలను జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం.. ఎముకలు బలహీనంగా ఉన్నప్పుడు, అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. చిన్న చిన్న అలవాట్లు మీ ఎముకలను బలహీనంగా మారుస్తాయి.. దీంతోపాటు పలు సమస్యలు కూడా వస్తాయి.. అటువంటి పరిస్థితిలో, ఎముకలు బలహీనంగా మారితే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..? మీ ఎముకలను ఎలా బలంగా ఉంచుకోవాలి..? అనే విషయాలను తెలుసుకోండి.. ఎముకలు మన శరీరానికి ముఖ్యమైన ఆధారము.. దృఢంగా ఉండే ఎముకలు శరీరానికి నిర్మాణం, మద్దతు, చలనశీలతను అందిస్తాయి.. శరీరంలోని ఇతర అవయవాలను రక్షిస్తాయి.. అందుకే మన ఆరోగ్యానికి నిజమైన ఆధారం మన ఎముకలే. బలమైన ఎముకలు మనల్ని ఎక్కువ కాలం చురుగ్గా ఆరోగ్యంగా ఉంచుతాయి.. కానీ నేటి బిజీ జీవితం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తప్పుడు అలవాట్ల కారణంగా, ఎముకలు మరింత బలహీనంగా మారుతున్నాయి. అది పెరిగే వరకు మనం సమస్యను విస్మరిస్తాము. అటువంటి పరిస్థితిలో, ఎముక బలహీనతను గుర్తించడం %-% తప్పులను నివారించడం చాలా ముఖ్యం.. ఎముకలు బలహీనపడటానికి గల కారణాలు ఏమిటి..? దాని లక్షణాలు ఏమిటి..? నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకుందాం. ఎముకలు బలహీనపడటానికి అనేక కారణాలు ఉండవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు..

ఎముకలు బలహీనంగా మారడానికి కారణాలేమిటి

సర్వోదయ ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ అంచల్ ఉప్పల్ మాట్లాడుతూ.. చాలా మందికి ఆరోగ్యం.. ఇతర అంశాల గురించి తెలుసు.. కానీ ఎముకల గురించి అంతగా పట్టించుకోరు.. చిన్న చిన్న తప్పుల వల్ల ఎముకలు బలహీనపడటం ప్రారంభిస్తాయి. ఎముకలు, కీళ్లలో నిరంతరం నొప్పి ఉంటే, అది అనేక సమస్యలకు సంకేతం కావచ్చు. కాల్షియం విటమిన్ డి లోపం ఎముకలను బలోపేతం చేయడానికి ముఖ్యమైన పోషకాలు కాల్షియం, విటమిన్ డి. మీ ఆహారంలో పాలు, పెరుగు, జున్ను, ఆకుపచ్చ కూరగాయలు, బాదం వంటి ఆహారాలు లేకపోతే, మీ ఎముకలు క్రమంగా బలహీనపడటం ప్రారంభిస్తాయి. సూర్యరశ్మి లేకపోవడం వల్ల విటమిన్ డి లోపం సంభవిస్తుంది. దీని కారణంగా శరీరం కాల్షియంను సరిగ్గా గ్రహించలేకపోతుంది. జంక్ ఫుడ్ కూల్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం ఈ రోజుల్లో పిల్లలు, పెద్దలలో జంక్ ఫుడ్ పట్ల క్రేజ్ బాగా పెరిగింది. శీతల పానీయాలలో ఫాస్పోరిక్ ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో కాల్షియం లోపానికి కారణమవుతుంది. దీనితో పాటు, అధిక ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారం కూడా ఎముకలకు శత్రువులుగా మారుతాయి. శారీరక శ్రమ లేకపోవడం ఢిల్లీలోని ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ పులీన్ కుమార్ వివరిస్తూ.. రోజంతా కూర్చునే లేదా చాలా తక్కువగా కదిలే వ్యక్తుల ఎముకలు ప్రభావితమవుతాయి. వ్యాయామం చేయడం లేదా నడవడం ద్వారా ఎముకలు బలంగా మారుతాయి. ముఖ్యంగా వెయిట్ లిఫ్టింగ్ వ్యాయామాలు ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. సోమరి జీవితాన్ని గడిపే వ్యక్తులకు ఆస్టియోపోరోసిస్ (ఎముకలు బలహీనపడటం) ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ధూమపానం మద్యపాన వ్యసనం ధూమపానం మద్యం సేవించడం ఊపిరితిత్తులు, కాలేయానికి మాత్రమే కాకుండా, ఎముకలకు కూడా ప్రమాదకరం. ధూమపానం ఎముక కణాలను బలహీనపరుస్తుంది. ఎముక సాంద్రతను తగ్గిస్తుంది. మరోవైపు,



మద్యం శరీరంలోని పోషకాల శోషణను ప్రభావితం చేస్తుంది. వయస్సు హార్మోన్లలో మార్పులు స్త్రీలలో రుతువిరతి తర్వాత ఎముక బలహీనత ఒక సాధారణ సమస్య. వయస్సు పెరిగే కొద్దీ శరీరంలో హార్మోన్ల మార్పులు సంభవిస్తాయి. దీని వలన ఎముకల సాంద్రత తగ్గుతుంది. పురుషులలో కూడా, వయస్సు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడటం ప్రారంభమవుతుంది. ఎముకలు బలహీనపడటం లక్షణాలు ఏమిటి ఎటువంటి కారణం లేకుండా కీళ్లలో నొప్పి, వీపు లేదా నడుములో నిరంతరం నొప్పి, ఎత్తు క్రమంగా తగ్గడం, చిన్న గాయాలలో కూడా ఎముకలు విరగడం, త్వరగా అలసిపోయినట్లు అనిపించడం, శరీరం వంగిపోయినట్లు అనిపించడం వంటివి ఉంటాయని డాక్టర్ అంచల్ ఉప్పల్ తెలిపారు.. ఎముకలను బలోపేతం చేయడానికి మార్గాలు ప్రతిరోజూ కనీసం 15-20 నిమిషాలు ఎండలో కూర్చోండి. కాల్షియం విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాన్ని తినండి రోజులో కొద్దిసేపు నడవండి లేదా తేలికపాటి వ్యాయామం చేయండి. ధూమపానం మద్యం నుండి దూరంగా ఉండండి మీ వైద్యుడు సూచించిన విధంగా ఎముక సాంద్రత పరీక్షలను క్రమానుగతంగా చేయించుకోండి.

నల్లగా ఉన్నాయని తీసిపారేయకండి..

సర్వరోగ నివారిణి.. లాభాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు..



ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పిప్పళ్లను సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు.. ఆయుర్వేదంలో పిప్పళ్లను అనేక రోగాలకు దివ్యౌషధంగా ఉపయోగిస్తుంటారు. అస్తమా, బ్రోన్కైటిస్, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారిపై పిప్పలి అద్భుతమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కఫం, శ్లేష్మాన్ని తొలగించడంలో సహాయపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వంటగదిలో మన ఆరోగ్యానికి సంబంధించిన అనేక ఔషధ సుగంధ ద్రవ్యాలు దాగి ఉన్నాయి.. అలాంటి ఒక ఔషధ నిధి పిప్పలి (పిప్పళ్లు).. ఇది ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారించడంలో ప్రయోజనకరంగా ఉండే అద్భుతమైన ఆయుర్వేద ఔషధం అని నిపుణులు చెబుతున్నారు. పిప్పలి.. దీన్ని మనం తెలుగులో పిప్పళ్లు అని కూడా పిలుస్తాం.. ఇంకా పిప్పళ్లని ఆంగ్లంలో లాంగ్ పెప్పర్ అంటారు.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పిప్పళ్లను సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు.. ఆయుర్వేదంలో పిప్పళ్లను అనేక రోగాలకు దివ్యౌషధంగా ఉపయోగిస్తుంటారు. అస్తమా, బ్రోన్కైటిస్, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారిపై పిప్పలి అద్భుతమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కఫం, శ్లేష్మాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. దీనికి శోథ నిరోధక లక్షణాలు ఉన్నందున, ఇది నొప్పి నివారిణిగా పనిచేస్తుంది.. కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయపడుతుంది. పిప్పళ్లను చరక సంహితలో ఒక ముఖ్యమైన ఔషధంగా వర్ణించారు.. దీనిని అనేక వ్యాధులలో ఉపయోగిస్తారు.

పిప్పలి ప్రయోజనాలు

పిప్పళ్లు దగ్గు, శ్వాసకోశ వ్యాధులు, జీర్ణ సంబంధిత సమస్యలకు ముఖ్యంగా ప్రయోజనకరంగా ఉంటాయి.. సుశ్రుత సంహితలో, దీనిని దహన్ ఉపకర్ణ అని పిలుస్తారు.. అంటే చర్మ సంబంధిత సమస్యలను తగ్గించడంలో సహాయపడే ఔషధం. వాస్తవానికి, ఇది రక్తాన్ని శుభ్రపరుస్తుంది.. మొటిమలు, మొటిమలు, దురద వంటి సమస్యలను తొలగిస్తుంది.

సుగంధ ద్రవ్యంగా ఉపయోగిస్తారు

ఆయుర్వేదం ప్రకారం.. పిప్పళ్లు.. పైపెరేసి కుటుంబానికి చెందిన పుష్పించే తీగ, దీని పండ్ల కోసం పెంచుతారు. దీనిని సాధారణంగా ఎండబెట్టి సుగంధ ద్రవ్యంగా ఉపయోగిస్తారు. పొడవాటి మిరియాలు దాని దగ్గరి బంధువు పైపర్ నిగ్రమ్ కంటే రుచిగా ఉంటాయి.. కానీ తియ్యగా.. తక్కువ ఘాటుగా ఉంటాయి.. ఇది మనకు నలుపు, ఆకుపచ్చ, తెలుపు మిరియాలను ఇస్తుంది. ఇది జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది.. దాని శోథ నిరోధక లక్షణాల కారణంగా మంటను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

గర్భిణీ స్త్రీలు దీనిని నివారించాలి..

దీనిని రోగనిరోధక శక్తిని పెంచేది అని కూడా అంటారు. ఇది జీర్ణవ్యవస్థ, శ్వాసకోశ వ్యవస్థను నియంత్రణలో ఉంచుతుంది. దీని స్వభావం వేడిగా ఉంటుంది.. అందుకే గర్భిణీ స్త్రీలు దీనిని నివారించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.. ఆయుర్వేదం ప్రకారం, పిప్పలి ఉబ్బసం, బ్రోన్కైటిస్, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారిపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కఫం శ్లేష్మం తొలగించడంలో సహాయపడుతుంది.

ఎలా తినాలి?

పిప్పలి జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటుంది.. మూత్ర వ్యాధులను కూడా నయం చేస్తుంది. సాధారణంగా, దీనిని చాలా వంటకాల్లో ఉపయోగిస్తారు. 1/4 నుంచి 1/2 టీస్పూన్ తేనె లేదా వేడి నీటితో తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.. అయితే.. దగ్గు జలుబు సమయంలో మింగడంలో ఇబ్బంది ఉంటే, నీటిలో వేసి మరిగించి త్రాగడం కూడా ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతారు. ఇది కూడా సాధ్యం కాకపోతే, వైద్యుడి సలహా మేరకు, మీరు దానిని క్యాప్సూల్ టాబ్లెట్ రూపంలో ఉపయోగించవచ్చు.

చేప గుడ్లు తింటున్నారా..?

అయితే, మీ శరీరంలో జరిగేది ఇదే..!



నాన్ వెజ్ ప్రియులు చికెన్, మటన్‌తో పాటు చేపలు కూడా ఎక్కువగా తింటూ ఉంటారు. అలాగే, చేపలతో పాటు వాటి గుడ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. కానీ, చేప గుడ్లను తరచూ తినటం వల్ల శరీరంలో కలిగే మార్పులు, ఆరోగ్య ప్రయోజనాలేంటో ఎప్పుడైనా ఆలోచించారా..? పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ చేప గుడ్లలో ప్రధానంగా మెగ్నీషియం, ఫాస్ఫరస్, విటమిన్ డి, కాల్షియం ఉంటాయి. చేప గుడ్లు తినే అలవాటు కూడా చాలామందిలో ఉంటుంది. ఈ గుడ్లలో పోషకాలు ఉంటాయి. పొటాషియం కలిగి ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గిస్తుంది. అయితే లోబీపీతో బాధపడేవారు తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. అలాగే, గుండె ఆరోగ్యానికి కూడా చేప గుడ్లు ఎంతో ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. తరచూ చేప గుడ్లు తినటం వల్ల గుండె ప్రమాదాలు దరి చేరకుండా తప్పిస్తాయి. ఇందులో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ మెదడు పనితీరును మెరుగు చేస్తుంది. అంతేకాదు చేప గుడ్ల వల్ల కంటి ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లకు వ్యతిరేకంగా పోరాడుతాయి. చేప గుడ్లలోశరీరానికి అవసరమైన న్యూట్రిషన్లు, బి 12, డి, ఎ తదితర విటమిన్లు, మినరల్స్, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. మతిమరపు సమస్య ఉన్నవారు, అల్జీమర్స్ పేషెంట్లు కూడా క్రమం తప్పకుండా చేప గుడ్లను తినటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. చేప గుడ్లలో లభించే విటమిన్ ఏ కంటి చూపు మెరుగుపరచడంలో సాయపడుతుంది. చేపలు, వాటి గుడ్లు తినటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగి రక్తం శుద్ధి చేస్తుంది. రక్తహీనతతో బాధపడే వారికి చేపగుడ్లు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. రెగ్యులర్‌గా చేప గుడ్లు తింటే బీపీ సమస్య తగ్గుతుంది. చేప గుడ్లలో ఉండే విటమిన్ డి తో ఎముకలు, దంతాలను దృఢంగా మారతాయి. చేప గుడ్లు చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. వీటితో చర్మానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. వృద్ధాప్యాన్ని దూరం చేస్తుంది. శరీరానికి అవసరమైన పాళ్లలో అయోడిన్ ఉంటుంది. హార్మోన్ బ్యాలెన్స్‌కి, జీర్ణక్రియకు ఇది ఉపయోగపడుతుంది. కండరాల ఎదుగుదలకు చేపగుడ్లు ఉపయోగపడతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది ఈ కూరగాయ బెస్ట్ ఇమ్యూనిటీ బూస్టర్.. తరచూ తింటే ఇలాంటి సమస్యలన్నీ తరచూ కలలో పాములు కనిపిస్తున్నాయా..? ఏం జరుగుతుందో తెలిస్తే.. తమషా కాదు..! సర్వ రోగాలకు దివ్యౌషధం ఈ ఆకు.. ప్రయోజనాలు తెలిస్తే.. మరో హనీమూన్ జంట మిస్సింగ్..13 రోజులైనా దొరకని ఆచూకీ.ఏం జరిగిందంటే ఆరోగ్య నిపుణులు, ఇతర అధ్యాయనాల ద్వారా అందిన సమాచారం మేరకు ఈ వివరాలు అందిస్తున్నాం.. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. ఏదైనా సందేహాలు,సమస్యలు ఉన్నా వైద్యులను సంప్రదించడమే మంచిదని గమనించగలరు.

రాత్రిపూట 'డార్క్ చాక్లెట్' తింటే మంచిదేనా

అధ్యయనాలు ఏం చెప్తున్నాయంటే!

డార్క్ చాక్లెట్‌తో ఆరోగ్య ప్రయోజనాలు

రాత్రిపూట తినడం మంచిదా, కాదా?



చాక్లెట్లను చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ చాలా ఇష్టంగా తింటారు. అన్ని రకాల చాక్లెట్స్‌తో పోలిస్తే, డార్క్ చాక్లెట్ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటి వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటం, మధుమేహం నియంత్రణ, రక్తపోటు తగ్గడం, మెదడు పనితీరు మెరుగుపడటం, ఒత్తిడి తగ్గడం వంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.ఇది చర్మ సంరక్షణకు కూడా సహాయపడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. ఇందులో ఫ్లేవనాయిడ్లు శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి, అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని వివరిస్తున్నారు. మరోవైపు వీటి వల్ల ఆరోగ్య ప్రయోజనాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

యాంటీఆక్సిడెంట్లు : డార్క్ చాక్లెట్ ఫ్లేవనాయిడ్లు అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి వాపు, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుందని అంటున్నారు. అంతేకాకుండా రాత్రిపూట శరీర కణాల పునరుద్ధరణకు తోడ్పడతాయని వివరిస్తున్నారు. డార్క్ చాక్లెట్ అలసటను తగ్గించడంలో సహాయపడతాయని, మెదడు ఆరోగ్యం, జీవన నాణ్యతలో మెరుగుదలకు దారితీస్తుందని నడుస్తున్నప్పుడు కాళ్లలో నొప్పి - అయితే మీలో 'ఆ సమస్య' ఉండొచ్చంటున్న వైద్యులు!

మెరుగైన మానసిక స్థితి : డార్క్ చాక్లెట్ 'ఫీల్-గుడ్' రసాయనాలైన సెరోటోనిన్, ఎండార్ఫిన్ల ఉత్పత్తిని ప్రేరేపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి మెదడును ప్రశాంతంగా ఉండటానికి సహాయపడుతుందని అంటున్నారు. అంతేకాకుండా ఇందులో ఉండే పాలీఫెనాల్స్ అనేవి కార్టిసాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయని, దీంతో ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా ఉండొచ్చని పేర్కొంటున్నారు.

నిద్రకు భంగం : డార్క్ చాక్లెట్‌లో సహజంగా కెఫిన్, థియోబ్రోమిన్ అనే ఉద్దీపనలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కెఫిన్‌కు సున్నితత్వం ఉన్నవారు పడుకునే ముందు ఇవి తింటే ఆలస్యంగా నిద్ర పట్టడం లేదా నిద్ర నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే డార్క్ చాక్లెట్‌ను అతిగా తినకుండా దీని ప్రయోజనాలను ఆస్వాదించడానికి మితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

జీర్ణ సమస్యలు : కొంతమందికి కడుపులో యాసిడ్ రిఫ్లక్స్ లేదా గుండెల్లో మంటను ప్రేరేపించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా నిద్ర పోవడానికి ముందు ఇవి తింటే ఇలాంటి సమస్యలు రావొచ్చని హెచ్చరిస్తున్నారు. చాక్లెట్‌ను భోజనం తర్వాత తీసుకోవడం వల్ల అన్నవాహిక సమస్యలున్న రోగుల్లో యాసిడ్ ఎక్స్‌పోజర్ గణనీయంగా పెరిగిందని అధ్యయనం పేర్కొంది.

తీపి తినాలనే కోరిక : డార్క్ చాక్లెట్‌లో మిల్క్ చాక్లెట్ కంటే తక్కువ చక్కెర ఉన్నప్పటికీ, అది తీపి కోరికలను ప్రేరేపిస్తుందని నిపుణులు వివరిస్తున్నారు. దీన్ని రాత్రి సమయంలో అధికంగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు, బరువు పెరగడానికి దారి తీస్తాయని చెబుతున్నారు. ఉదయం లేదా సాయంత్రం/రాత్రి చాక్లెట్ తినడం వల్ల శక్తి సమతుల్యత భిన్నంగా ప్రభావితమవుతుంది. శక్తి తీసుకోవడంలో మార్పులు, ఉపరితల ఆక్సీకరణ, మైక్రోబయోటా, సిర్కాడియన్-సంబంధిత వేరియబుల్స్ కారణంగా శరీర బరువుపై ప్రభావం చూపుతుందని ప్రచురించింది.రాత్రిపూట డార్క్ చాక్లెట్ తినాలనుకుంటే తక్కువ మొత్తంలో, నిద్రవేళకు కనీసం 1-2 గంటల ముందు తినడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో 70 శాతం అంతకంటే ఎక్కువ కోకో కంటెంట్ ఉన్న డార్క్ చాక్లెట్‌ను మితంగా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన ఫ్లేవనాయిడ్లు ఎక్కువగా ఉండి, చక్కెర తక్కువగా ఉంటుందని తెలియజేస్తున్నారు. అంతేకాకుండా, నిద్ర భంగం కలగకుండా ప్రశాంతత, మానసిక స్థితిని పెంచే ప్రయోజనాలను ఆస్వాదించవచ్చని సలహా ఇస్తున్నారు. ఒకవేళ మీకు నిద్ర సమస్యలు లేదా కెఫిన్ సున్నితత్వం ఉంటే, రాత్రిపూట డార్క్ చాక్లెట్ తినకపోవడమే మంచిదని సిఫార్సు చేస్తున్నారు.

నవంబర్ 15 లోగా ఆ పని చేయాలి.. ఈపీఎఫ్ఓ సంస్థ హెచ్చరిక..!



ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పీఎఫ్ కు సంబంధించి కీలక సూచన చేసింది. యాజమాన్యాలు అక్టోబర్ 2026 నెలకు సంబంధించిన పీఎఫ్ కంట్రిబ్యూషన్లు, ఈసీఆర్ ఫైలింగ్‌ను నవంబర్ 15లోగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు నవంబర్ 12న తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటన చేసింది. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తే ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో డబ్బులు సకాలంలో జమ అవుతాయని పేర్కొంది. ప్రతి నెలా ఉద్యోగుల జీతాలు, పీఎఫ్ కంట్రిబ్యూషన్లకు సంబంధించిన వివరాలను యాజమాన్యాలు ఈపీఎఫ్ఓకు ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియనే ఎలక్ట్రానిక్ చలాన్-కమ్-రిటర్న్ అని అంటారు. ఇందులో ఉద్యోగుల వివరాలు, వారి వేతనాలు, పీఎఫ్ కింద ఎంత మొత్తం చెల్లించాలనే సమాచారం నమోదు చేయాల్సి ఉంటుంది. ఈసీఆర్ సమర్పించిన తర్వాత సంబంధిత పీఎఫ్ మొత్తాన్ని కూడా చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఈసీఆర్‌ను ఫైల్ చేయడంతో పాటు, పీఎఫ్ కంట్రిబ్యూషన్ మొత్తాన్ని కూడా నవంబర్ 15, 2026లోగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ గడువు దాటితే.. నిబంధనల ప్రకారం అదనపు వడ్డీ, నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది. చివరి రోజు వరకు వేచి చూడకుండా ముందుగానే ఈ పనిని పూర్తి చేయాలని ఎక్స్ లో ట్వీట్ చేసింది. మీ జీతంలో పీఎఫ్ ఎంత కట్ అవుతుంది.. అందులో పెన్షన్?కు ఎంత వెళ్తుంది..! ఈసీఆర్ ఫైల్ చేసే ముందు ఉద్యోగుల పేర్లు, వ్యక్తిగత వివరాలు, జీతాల సమాచారం, పీఎఫ్ లెక్కలను ఒకసారి సరిచూసుకోవాలని కూడా సూచించింది. ఏవైనా తప్పులు ఉంటే వాటిని ముందుగానే సరిదిద్దుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే చివరి నిమిషంలో ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది కాబట్టి, గడువుకు ముందే ఫైలింగ్, చెల్లింపు రెండూ పూర్తయ్యాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించింది. కాగా ఈపీఎస్ భాగంగా ఇచ్చే కనీస పెన్షన్ పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. అయితే కనీస పెన్షన్ రూ.1000 నుంచి రూ.3 వేలకు పెంచే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి నవంబర్ 19న నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో 81.48 లక్షల ఎంప్లాయి పెన్షన్ స్కీమ్ పెన్షన్ దారులు ఉన్నారు. ఇందులో సుమార్ 73.55 లక్షల మందికి రూ.3 వేల లోపు పింఛన్ తీసుకుంటున్నారు. కనీస పింఛన్ రూ.3 వేలకు పెంచిదే వీరందరికి లబ్ధి చేకూరనుంది. 2014లో ఈపీఎఫ్ఓ కనీస వేతన పరిమితిని రూ.6,500 నుంచి రూ.15 వేలకు పెంచింది. అప్పుడు కూడా కనీస పింఛనును రూ.1000 చేసింది. 2014 కు ముందు చాలా మందికి రూ.1000 లోపు పింఛన్ ఉండేది. పెరిగిన ద్రవ్యోల్బణం దృష్టిలో ఉంచుకుని కనీస పింఛన్ ను రూ. 5000 చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే కేంద్రం మాత్రం రూ.3000 కనీస పింఛన్ ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్.. బీమా సౌకర్యం కల్పించిన తెలంగాణ ప్రభుత్వం..!



గిగ్ వర్కర్లకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం 'గిగ్ వర్కర్ల చట్టం' అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో జరిగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఈ గిగ్ వర్కర్ల చట్టాన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికే గిగ్ వర్కర్ల బోర్డును ఏర్పాటు చేసింది. గిగ్ వర్కర్లకు ఇప్పటికే బీమా సౌకర్యాన్ని కూడా కల్పిస్తోంది. హైదరాబాద్‌లో ఈరోజు జరిగిన తెలంగాణ గిగ్ వర్కర్ల ప్రత్యేక భద్రతా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో ప్రతిష్టాత్మకమైన 'గిగ్ వర్కర్ల చట్టం' అమలులోకి రానుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లో రాహుల్ గాంధీతో కలిసి 'తెలంగాణ గిగ్ వర్కర్ల ప్రత్యేక భద్రతా పథకం' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం ఇప్పటికే గిగ్ వర్కర్ల బోర్డును ఏర్పాటు చేసిందని, గిగ్ వర్కర్లకు బీమా సౌకర్యాన్ని కూడా కల్పిస్తోందని తెలిపారు. తెలంగాణలో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నేడు నెరవేర్చడం ఎంతో సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. రైతులకు గుడ్ న్యూస్.. త్వరలో రైతు భరోసా..! కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4,000 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ, పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన పాదయాత్ర సమయంలో, గిగ్ వర్కర్లు రాహుల్ గాంధీని కలిసి తమ వృత్తిపరమైన ఇబ్బందులను, సవాళ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అప్పుడు రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిగ్ వర్కర్ల రక్షణ కోసం చట్టాన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గాంధీ కుటుంబం ఎల్లప్పుడూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని, దేశం కోసం ప్రాణత్యాగం కూడా చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా కవరేజీని కల్పిస్తోందని, అలాగే 'ఆరోగ్యశ్రీ' పథకం కింద కవరేజీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిందని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు గిగ్ వర్కర్లకు అన్ని విధాలా రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని, గిగ్ వర్కర్లకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్ల తరపున రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

జెన్సన్ హువాంగ్ రాజీనామా ఎన్విడియాలో అసలు ఏం జరిగింది



ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ చిప్ కంపెనీ ఎన్విడియాలో ఊహించని భూకంపం సంభవించింది. కంపెనీ ఉన్నత యాజమాన్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామం, సంస్థ భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మార్చేసింది. ఎన్విడియా వ్యవస్థాపకుడు, సీఈఓ అయిన జెన్సన్ హువాంగ్‌కు ముగ్గురు మహిళలతో వివాహేతర సంబంధాలు ఉన్నట్లు తేలడంతో, ఆయన స్వయంగా ముందుకు వచ్చి తన అన్ని నిర్వాక పదవుల నుంచి తప్పుకున్నారు. ఈ వార్తతో నిన్న అమెరికన్ స్టాక్ మార్కెట్‌లో పెద్ద కుదుపు ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. ఎన్విడియా షేర్లు 4.34 శాతం పడిపోగా, దాని పోటీ సంస్థలైన ఏఎండీ, బ్రాడ్‌కామ్ వంటివి 5 శాతానికి పైగా లాభపడ్డాయి. షేర్ల పతనం మరో 2008 ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందా.. నిపుణులు ఏమంటున్నారంటే.. దీన్నిబట్టి చూస్తే, ఇన్వెస్టర్లు ఎన్విడియాను వదిలేసినా, ఏఐ రంగాన్ని మాత్రం వదిలిపెట్టేందుకు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. మరోవైపు, ఏఐ ఇన్వెస్టర్లు 'బై ఆన్ డిప్స్' వ్యూహాన్ని పాటిస్తున్నారు. అంటే, ఈ రంగంలోని షేర్ల ధరలు తగ్గినప్పుడల్లా కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా, శుక్రవారం ట్రేడింగ్‌లో ఎన్విడియా షేర్లు మళ్లీ లాభాలతో ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నారు. నిన్నటి భారీ పతనం నుంచి కోలుకోవడంతో, ఎన్విడియా మార్కెట్ విలువ మళ్లీ 4 ట్రిలియన్ డాలర్లకు పైగా పెరిగింది. ఇది కంపెనీకి ఉన్న బలంగా కనిపిస్తోంది. నాడు ఏఐని శాసించిన దిగ్గజం నేడు దీన స్థితిలో.. రూ. లక్షల కోట్ల నష్టాలతో భోరుమంటున్న ఇన్వెస్టర్లు.. ఈ వారం ట్రేడింగ్‌ను పరిశీలిస్తే, ఎన్విడియా షేర్లు 11 శాతం నష్టపోయినా, ఏఎండీ 30 శాతం, బ్రాడ్‌కామ్ 24 శాతం లాభపడ్డాయి. దీనివల్ల, ఇప్పటివరకు ఎన్విడియాకు మాత్రమే ఉన్న ఆధిపత్యం ఇప్పుడు ఇతర కంపెనీలకు కూడా పంచుతున్నట్లు స్పష్టమవుతోంది. అదేవిధంగా, ఏఐ చిప్‌లను తయారుచేసే తైవాన్ సెమీకండక్టర్ కంపెనీ షేర్లు కూడా ఈ వారం 11 శాతం పెరిగాయి. అమెరికాలో డెమోక్రటిక్ పార్టీ ఏఐ విషయంలో పెడుతున్న అడ్డంకులు, ఎన్విడియా పతనం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, ఏఐ టెక్నాలజీపై, ఈ రంగంపై ఇన్వెస్టర్లలో బలమైన నమ్మకం ఏర్పడింది. ఒక్క వార్తతో రూ.లక్షల కోట్లు మాయం.. కుప్పకూలిన దిగ్గజం చీజఅఎఱు షేర్లు.. ఎంత భారీ పతనమంటే.. సెమీకండక్టర్ పరిశోధన సంస్థ 'సెమీఅనాలిసిస్' సీఈఓ డైలాన్ పటేల్ మాట్లాడుతూ, జెన్సన్ హువాంగ్ రాజీనామాతో ఏఐ సప్లై చైన్‌లో పోటీతత్వం పునర్వ్యవస్థీకరించబడుతుందని అన్నారు. ఇదే సమయంలో, ఐబీఎం రెండు రోజుల క్రితం ఒక కొత్త చిప్‌ను పరిచయం చేసింది. క్వాంటం నైట్‌హాక్ తీ3' పేరుతో వచ్చిన ఈ చిప్, హైబ్రిడ్ క్వాంటం క్లాసిక్ కంప్యూటింగ్, క్వాంటం మెషిన్ లెర్నింగ్ పద్ధతుల్లో ఏఐ పనులను చేయగలదు. అలాగే, ఓపెన్‌సోర్స్ ఏఐ టెక్నాలజీని పూర్తిగా అడ్డుకోవాలనే వాదనలు పెరుగుతున్న నేపథ్యంలో, అమెరికా ప్రభుత్వ నియంత్రణలో ఉండే ఏఐ కంపెనీల ఆధిపత్యం మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

లిస్టింగ్ తర్వాత మొదటిసారి రూ.1903కు చేరిన పేటీఎం షేర్లు..!



పేటీఎం మాతృ సంస్థ అయిన 'వన్ 97 కమ్యూనికేషన్స్' షేర్ ధర, గురువారం జరిగిన ఇంట్రాడే ట్రేడింగ్‌లో భారీ లావాదేవీల మధ్య 7 శాతం పెరిగి రూ.1,903.05 కు చేరింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై కొత్త 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' విధానం అమలులోకి వస్తుందనే ఆశలే ఈ ధరల పెరుగుదలకు కారణమని తెలుస్తోంది. 2021 నవంబర్ 18న స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత, ఈ ఫిన్‌టెక్ కంపెనీ షేర్ ధర రూ.1,900 స్థాయిని దాటడం ఇదే మొదటిసారి. కంపెనీ తన ఐపీఓ లో షేర్లను రూ.2,150 ధర వద్ద జారీ చేసింది. అప్పట్లో లిస్టింగ్ రోజున ఈ షేర్ గరిష్టంగా రూ.1,961.05 వరకు చేరుకుంది. గురువారం నాటి ఈ పెరుగుదలతో, అక్టోబర్ 26న నమోదైన కనిష్ట స్థాయి రూ.1,582.95 నుండి ఈ స్టాక్ 20 శాతం పుంజుకుంది. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో కలిపి మొత్తం 6.68 మిలియన్ల షేర్లు చేతులు మారాయి. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ అమలు కానుందనే అంచనాలతో మార్చి 30న నమోదైన 52 వారాల కనిష్ట స్థాయి రూ.947.10 నుంచి సెప్టెంబర్ 16 నాటికి పేటిఎం షేర్ ధర 96 శాతం పెరిగి రూ.1,856.50కి చేరుకుంది. కాగా, అక్టోబర్ 15 నుండి కొన్ని రకాల యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ను అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ, దానికి రెండు రోజుల ముందు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ నిర్ణయాన్ని దీపావళి తర్వాత వరకు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా యూపీఐ ద్వారా రూ.2,000 పైబడిన పర్సన్-టు-మర్చంట్ లావాదేవీలపై ప్రతిపాదిత 40 బేసిస్ పాయింట్ల ఎండీఆర్ అమలు తేదీపై స్పష్టత రాలేదు. బ్యాంక్ ఖాతా లేకపోయినా రూ.50 వేల వరకు మనీ పంపుకోవచ్చు. కొత్త రూల్స్ గురించి ఓ సారి తెలుసుకోండి.. ఈ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న బ్యాంకులు, దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి పెట్టుబడిగా పెడతామని సూచించాయి. ఇది వారి ఆదాయాన్ని లేదా లాభదాయకతను పెంచడానికి కాకుండా, ప్లాట్‌ఫారమ్‌ను మరింత విస్తరించడానికి, ఎక్కువ మంది వ్యాపారులను చేర్చుకోవడానికి, దాని భద్రత, సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. త్వరలో యూపీఐపై ఎండీఆర్ అమల్లోకి వస్తున్నందున (ఖచ్చితమైన అమలు తేదీ ఇంకా వెల్లడి కాలేదు), జెఫరీస్‌లోని విశ్లేషకులు 28 నుంచి దాదాపు రూ.800 కోట్ల నుంచి రూ.850 కోట్ల వరకు కొత్త ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ స్టాక్‌పై 'బై' రేటింగ్‌ను కొనసాగిస్తూ, రూ.2,150 టార్గెట్ ప్రైస్ ఇచ్చింది రెలిగేర్ బ్రోకింగ్‌లో ఎస్‌విపి-రీసెర్చ్. ఈ స్టాక్ తన స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక ఎక్స్‌పోనెన్షియల్ మూవింగ్ యావరేజ్‌ల కంటే పైన ట్రేడ్ అవుతోందని పేర్కొంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

సామాన్యులకు షాక్.. పెరగనున్న టీ, టిఫిన్, భోజనాల ధరలు..!



కొద్ది నెలల క్రితం అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో ఎల్పీజీ ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా కమర్షియల్ ఎల్పీజీ ధరలు భారీగా పెరగడంతో చిన్న హోటళ్ల నుంచి పెద్ద రెస్టారెంట్ల వరకు టీ, టిఫిన్, భోజనాల ధరలు భారీగా పెంచాయి. చిన్న టిఫిన్ సెంటర్లలో రూ.30 ఉన్న టిఫిన్ ధర రూ.40 కు పెంచారు. రూ.40 ఉన్న ధర రూ.50 పెరిగింది. ఇప్పుడు అవే ధరలు కొనసాగుతున్నాయి. తాజాగా ముడిసరకుల ధరలు పెరగడంతో మరోసారి మరోసారి టీ, టిఫిన్ల, భోజనాల ధరలు పెరగనున్నాయి. కొన్ని రెస్టారెంట్లు ఇప్పటికే ధరలు పెంచాయి. ఉదయాన్నే హోటళ్లలో వేడివేడి ఇడ్లీ, దోశ, వడ తింటారు. దోశ, ఇడ్లీ చేయడానికి బియ్యం అవసరం. వడ చేయడానికి మినప పప్పు, పూరీలకు గోధమ పిండి. ఇప్పుడు బియ్యం, పప్పులు, గోధమ పిండి ధరలు పెరిగాయి. అలాగే పాల ధరలు కూడా పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్లు, హోటళ్లు తమ మెనూ ధరలను భారీగా పెంచినట్లు వార్తలు వస్తున్నాయి. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, ద్రవ్యోల్బణ ఒత్తిడి కారణంగా హోటల్ యాజమాన్యాలు ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని తెలుస్తోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు హోటల్ తిండి భారం కానుంది. గడచిన 6 నుంచి 8 నెలల కాలంలో ముడిసరుకుల ధరలు దాదాపు 15 నుంచి 20 శాతం వరకు పెరిగాయని రెస్టారెంట్ యజమానులు చెబుతున్నారు. అంతే కాకుండా కమర్షియల్ గ్యాస్ బుడ్ల ధరలు ఇప్పటికీ ఎక్కువగానే ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. ూశ్రీంశీ =ఝుఎ =ప్ష్రబ దీష్ఝుతీశీఝ: రైతులకు గుడ్ న్యూస్.. త్వరలో రైతు భరోసా..! పాలు, పనీర్, చీజ్ వంటి డెయిరీ ఉత్పత్తులతో పాటు కూరగాయలు, నూనెలు, చక్కెర, పప్పు దినుసుల పెరిగాయని గుర్తు చేస్తున్నారు. అన్ని వస్తువుల రేట్లు విపరీతంగా పెరగడంతో రెస్టారెంట్లపై భారం పడిందని ఓ రెస్టారెంట్ నిర్వాహకుడు చెప్పాడు. ఈ భారాన్ని కొంతవరకు వినియోగదారులపై మోపాల్సి వస్తోందని పేర్కొన్నాడు. ముఖ్యంగా సౌత్ ఇండియన్ టిఫిన్లు, కాఫీలు, మిల్క్ బేస్డ్ ఐటమ్స్‌లో ఎక్కువగా వాడే నెయ్యి, వెన్న ధరలు భారీగా పెరిగాయి. గత రెండున్నర నెలల్లోనే నెయ్యి, వెన్న ధరలు కిలోకి ఏకంగా రూ.150 వరకు పెరిగినట్లు రెస్టారెంట్ల యజమానులు గుర్తు చేస్తున్నారు. ఈ పెరుగుదల కారణంగా దోశలు, రైస్ ఐటమ్స్, లంచ్ మెనూల ధరలను 5 నుంచి 10 శాతం వరకు పెంచాల్సి వచ్చిందని తెలిపారు. దేశవ్యాప్తంగా డెయిరీ రంగంలో చోటుచేసుకున్న పరిణామాలు ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా వివరిస్తున్నారు. ఇటీవలే అమూల్ తన పాల ధరలను లీటరుకు రూ. 2-4 వరకు పెంచింది. అమూల్ తాజా లీటరుకు రూ. 2, అమూల్ గోల్డ్ లీటరుకు రూ. 4 చొప్పున ధరలు పెరిగాయి. మదర్ డెయిరీ కూడా పాల ధరను పెంచింది. నాందిని డెయిరీ కూడా పాల ధరలను పెంచింది. కేవలం పాలు, నెయ్యి మాత్రమే కాకుండా బియ్యం, పప్పులు, పంచదార, వంట నూనెలు, కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో రూ.100 ఖర్చయ్యే సాధారణ భోజనం, టిఫిన్ ఇప్పుడు రూ.105 నుంచి రూ.110 వరకు చేరింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఎన్విడియాలో పెట్టుబడి పెట్టిన భారతీయ మ్యూచువల్ ఫండ్లు ఇవే..!



అమెరికాకు చెందిన చిప్‌మేకర్ ఎన్విడియాలో నెలకొన్న నాయకత్వ సంక్షోభం తీవ్రతరం కావడంతో నవంబర్ 12న ఉదయం యూఎస్ ట్రేడింగ్‌లో దాని షేర్లు 6.04 శాతం పడిపోయి 163.23 డాలర్లకు చేరాయి. ఇది అంతకుముందు ముగింపు ధర అయిన వి173.73 కన్నా వి10.50 తక్కువ. ఈ స్టాక్ ఇప్పుడు తన 52 వారాల గరిష్ఠ స్థాయి అయిన వి243.37 నుంచి దాదాపు 33 శాతం పడిపోయింది. ఎన్విడియా సహ-వ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పదవికి రాజీనామా చేయగా, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కోలెట్ క్రెస్ తాత్కాలిక ప్రాతిపదికన బాధ్యతలు స్వీకరించడంతో ఈ అమ్మకాలు చోటుచేసుకున్నాయి.భారతీయ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులకు ఇది గందరగోళంగా మారిది. భారతీయ మ్యూచువల్ ఫండ్లు ఎన్విడియాలో ఏ మేర పెట్టుబడి పెట్టారో చూద్దాం. ఏస్ ఎంఎఫ్ అక్టోబర్ 2026 పోర్ట్‌ఫోలియో డేటా విశ్లేషణలో ఎన్విడియాలో ప్రత్యక్ష వాటాలు కలిగిన 13 భారతీయ మ్యూచువల్ ఫండ్ పథకాలు, ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్‌లు ఉన్నాయి. ఈ కేటాయింపులు పథకాల ఆస్తులలో 0.63 శాతం నుంచి 12.12 శాతం వరకు ఉన్నాయి. అత్యధిక వాటా మిరే అసెట్ ూఢూ 500 టాప్ 50 లో ఉంది. దీని పోర్ట్‌ఫోలియోలో ఎన్విడియాకు 12.12 శాతం వాటా ఉంది. మిరే అసెట్ 10.02 శాతంతో దీని తర్వాతి స్థానంలో ఉంది. నాస్‌డాక్‌పై దృష్టి సారించిన పథకాలలో మోతీలాల్ ఓస్వాల్ నాస్‌డాక్ 100 ప్రుడెన్షియల్ నాస్‌డాక్ 100 ఇండెక్స్ ఫండ్‌లకు ఒక్కొక్కదానికి దాదాపు 8.02 శాతం పెట్టుబడి పెట్టాయి. ఒక్క వార్తతో రూ.లక్షల కోట్లు మాయం.. కుప్పకూలిన దిగ్గజం చీజఅఎఱు షేర్లు.. ఎంత భారీ పతనమంటే.. ఈ వాటా అంతర్జాతీయ ఇండెక్స్ ఉత్పత్తులకు మాత్రమే పరిమితం కాలేదు. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇంటర్నేషనల్ ఈక్విటీ ఫండ్‌కు 4.91 శాతం కేటాయింపు ఉండగా, ఎడెల్వీస్ టెక్నాలజీ ఫండ్‌కు 4.74 శాతం వాటా ఉంది. డీఎస్పీ వాల్యూ ఫండ్ 0.91 శాతం, యాక్సిస్ లార్జ్ మిడ్ క్యాప్ ఫండ్ 0.63 శాతం వాటాను కలిగి ఉన్నాయి. పెట్టుబడిదారులు కంపెనీ వాల్యుయేషన్‌ను, దాని వృద్ధి వ్యూహంపై సంభావ్య ప్రభావాలను పునఃసమీక్షిస్తున్నందున, సమీప భవిష్యత్తులో ఎన్విడియా షేర్ ధరలో అస్థిరత కొనసాగవచ్చుని నిపుణులు భావిస్తున్నారు. అయితే కొంత మంది నిపుణులు కంపెనీలో పెట్టుబడి పెట్టేందుకు ఇదే అనుకూల సమయమని పేర్కొంటున్నారు. విదేశాలలో పెట్టుబడి పెట్టే భారతీయ ఫండ్స్‌కు కరెన్సీ మార్పులు కూడా రూపాయి రాబడులను ప్రభావితం చేయగలవు. జెన్సన్ హువాంగ్ రాజీనామా ఎన్విడియాకు ఒక ముఖ్యమైన నాయకత్వ మార్పును సూచిస్తుంది. ప్రత్యేకించి ప్రపంచ ఏఐ పరిశ్రమలో కంపెనీని కేంద్ర స్థానంలో నిలపడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.



సంక్రాంతి బరిలో శర్వానంద్ 'జార్జ్ క్రిష్'..

మొదలైన డబ్బింగ్ పనులు, రిలీజ్ ఎప్పుడంటే?

టాలీవుడ్‌లో తనదైన రామెడీ టైమింగ్, విభిన్నమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు శ్రీను వైట్ల మరోసారి తన మార్క్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో మానస నారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొనగా.. తాజాగా చిత్ర బృందం మరో కీలక అప్‌డేట్‌ను వెల్లడించింది. 'జార్జ్ క్రిష్' సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అందుకోసం చిత్రీకరణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి డబ్బింగ్ పనులు ప్రారంభమైనట్లు చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. దీంతో సినిమా నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటున్నాయని తెలుస్తోంది. సాధారణంగా షూటింగ్ పూర్తయిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగవంతం చేస్తుంటారు. ఇప్పుడు 'జార్జ్ క్రిష్' డబ్బింగ్ పనులు కూడా ప్రారంభం కావడంతో సంక్రాంతి విడుదలకు చిత్ర యూనిట్ మార్గ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు అర్థమవుతోంది. శ్రీను వైట్ల తనదైన రామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో శర్వానంద్ రెండు విభిన్నమైన షేడ్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం.



'ఛావా' రికార్డు బద్దలు

కేవలం 9 రోజుల్లో రూ. 1100 కోట్ల క్లబ్‌లో 'రామాయణం'!



దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కించిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజండ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలతో దూసుకుపోతోంది. విడుదలైన కేవలం తొమ్మిది రోజుల్లోనే ఈ భారీ బడ్జెట్ చిత్రం విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' సినిమా లైఫ్‌టైమ్ ఇండియా నెట్ కలెక్షన్ల రికార్డును బద్దలు కొట్టింది. తొమ్మిదో రోజు దేశవ్యాప్తంగా రూ. 47.85 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టడంతో, భారతదేశంలో ఈ సినిమా మొత్తం నెట్ వసూళ్లు రూ. 612.45 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాస్ వసూళ్లు రూ. 1,100 కోట్లను దాటాయి. ప్రస్తుతం ఈ సినిమా భారతదేశపు గ్రాస్ కలెక్షన్లు రూ. 732.20 కోట్లకు, ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్లు రూ. 378.50 కోట్లకు చేరుకున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా 'రామాయణం' మొత్తం గ్రాస్ వసూళ్లు రూ. 1,110.70 కోట్లకు చేరాయి. ఈ చిత్రం ఇంతకు ముందే షారుఖ్ ఖాన్ 'పఠాన్' (రూ. 544.28 కోట్లు), రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' (రూ. 556.36 కోట్లు) సినిమాల లైఫ్‌టైమ్ వసూళ్ల రికార్డులను కూడా వెనక్కి నెట్టింది. వాల్మీకి మహర్షి రామాయణం ఆధారంగా రెండు భాగాలుగా ఈ చలనచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సీతాదేవిని రక్షించడానికి రాముడు సాగించిన ప్రయాణమే ఈ మొదటి భాగం యొక్క ప్రధాన కథాంశం. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియాస్, డిఎన్ఈజి మరియు యశ్ 'మానిస్టర్ మైండ్ క్రియేషన్స్' సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణాసురుడిగా యశ్, లక్ష్మణుడిగా రవి దూబే నటించారు. అలాగే హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్ కనిపించనున్నారు. ఈ సినిమా రెండవ భాగం 2028 దీపావళికి విడుదల కానుంది.



సేవ్ వైజాగ్..

టాలీవుడ్ హీరోయిన్ పోస్ట్ వైరల్

వైజాగ్ లేదా విశాఖపట్నం పేరు చెప్పగానే బీచ్, పచ్చని ప్రకృతి గుర్తొస్తుంది. సిటీ ఆఫ్ డెస్టినీ అని పిలుచుకునే ఈ నగరంలో ఆధునికత, పట్టణీకరణ పేరుతో కొండల్ని తవ్వుతుండటంపై తెలుగు హీరోయిన్ చాందిని చౌదరి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. తన సొంతు ఊరు అయిన వైజాగ్‌లో ప్రకృతి విధ్వంసం జరుగుతోందని రాసుకొచ్చింది. 'నా సొంతూరు వైజాగ్ పరిస్థితి చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. అభివృద్ధి, పట్టణీకరణ పేరుతో ఎటు చూసినా కొండలు, పర్వతాలను నిర్దాక్షిణ్యంగా తవ్వేస్తున్నారు' అని ఇన్ స్టా పోస్టులో చాందిని చౌదరి రాసుకొచ్చింది. ఇప్పుడు ఈ పోస్ట్ కాస్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిపోయింది. ఈమెకు సర్వాసరణ ప్రేమికులు, వైజాగ్ ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. చాందిని చౌదరి విషయానికొస్తే.. విశాఖపట్నంకి చెందిన ఈమె షార్ట్ ఫిల్మ్స్‌తో కెరీర్ ప్రారంభించింది. 2015లో వచ్చిన 'కేటుగాడు' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత 'కుందనపు బొమ్మ', 'శమంతకమణి', 'హౌరా బ్రిడ్జి', 'మను' తదితర మూవీస్ చేసింది. అయితే 'కలర్ ఫోటో'.. ఈమెకు చాలా గుర్తింపు తీసుకొచ్చింది. రీసెంట్ టైంలో గామి, దాకు మహారాజ్ తదితర చిత్రాల్లో కనిపించింది.



మెగాస్టార్ చిరంజీవి ఓటీటీ ఎంట్రీకి ముహూర్తం ఫిక్స్

టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దశాబ్దాలుగా తనదైన నటన, డ్యాన్స్, కామెడీ, యాక్షన్‌తో కోట్లాది మంది అభిమానులను అలరిస్తున్న ఆయన.. నెండితెరపై తిరుగులేని స్టార్‌డమ్‌ను సంపాదించుకున్నారు. అయితే ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో చిరంజీవి ఓటీటీ ఎంట్రీ కోసం అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఆ నిరీక్షణకు తెరపడనుంది. మెగాస్టార్ త్వరలోనే ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. చిరంజీవి ఓటీటీ ఎంట్రీ కోసం నెట్‌ఫ్లిక్స్ ఓ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 'మెగావర్స్' పేరుతో ఈ టాక్ షోను రూపొందిస్తున్నారు. సాధారణ టాక్ షోలకు భిన్నంగా మెగాస్టార్ స్టైల్, ఆయన మాటతీరు, సినీ అనుభవాలు, ఆసక్తికరమైన సంభాషణలతో ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ షోకు సంబంధించి పలు ఎపిసోడ్ల షూటింగ్ కూడా పూర్తయినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక ఈ కార్యక్రమంలో చిరంజీవి ఎలాంటి విషయాలను పంచుకోబోతున్నారు? ఆయనతో పాటు ఎవరెవరు అతిథులుగా పాల్గొనబోతున్నారు? సినీ పరిశ్రమకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు బయటకు వస్తాయా? అనే అంశాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా మెగాస్టార్‌ను ఒక టాక్ షో హోస్ట్‌గా చూడటం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని చెప్పొచ్చు. వాస్తవానికి 'మెగావర్స్' తొలి ఎపిసోడ్‌ను దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని తొలుత భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే కొన్ని కారణాలతో ఈ కార్యక్రమం స్ట్రీమింగ్ వాయిదా పడినట్లు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. డిసెంబర్ రెండో వారాంతంలో 'మెగావర్స్' తొలి ఎపిసోడ్‌ను స్ట్రీమింగ్‌కు తీసుకురావాలని నిర్వాహకులు ప్లాన్ చేస్తున్నారట. అయితే ఈ స్ట్రీమింగ్ తేదీపై ఇప్పటివరకు నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో డిసెంబర్ రెండో వారంలోనే ఈ షో ప్రారంభమవుతుందా? లేక మరోసారి విడుదల తేదీలో మార్పులు ఉంటాయా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు నెండితెరపై తనదైన ముద్ర వేసిన చిరంజీవి.. ఇప్పుడు డిజిటల్ వేదికపై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారనేది చూడాలి. ముఖ్యంగా ఆయన అభిమానులతో పాటు ఇతర సినీ ప్రేక్షకులు కూడా ఈ టాక్ షో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే డిసెంబర్ రెండో వారాంతంలో మెగాస్టార్ ఓటీటీ ప్రయాణం ప్రారంభం కానుంది. దీనిపై నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఓం'. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ నటీమణులు సాయి పల్లవి, శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను చిత్ర యూనిట్ ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంతో ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన కథాంశం ఈ సినిమా ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక ఈ చిత్రానికి యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండటం విశేషం. భారీ తారాగణంతో అత్యున్నత నిర్మాణ విలువలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

ధనుష్ 'ఓం' తెలుగు ట్రైలర్ విడుదల.. నవంబర్ 20న థియేటర్లలోకి!

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.